# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

బోనాల జోరు
అంబారిపై అమ్మోరు
మొక్కులు తీరు.

పెను గుమాను
తర్జన భర్జనలు
ఇంట్లో నరకం.

వరుణ యాగం
విస్తృతంగా వర్షాలు
ప్రకృతి వైద్యం.

కప్ప తాబేలు
నేతావతార రూపం
హర్త దేవుడు.

భూ ఆక్రమణ
యుగాల తరబడి
పేదల పోరు.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ధనికుడైన పేదకైన
ఓటందరికి సమానం !
తీసే హక్కు ఎవరికుంది
తొలగించుట అవమానం !
ఎట్లుందో చూస్తారా
మనదా ఈ దేశం ?
జంతర్ మంతర్ ప్రాంతం
పోలీసులకు వశం !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 8-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:58 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రజల వద్దకే పాలన.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తాం..**
**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



కరీంనగర్, అక్టోబర్ 7: ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే 'పల్లె పల్లెకు పొన్నం అన్న?పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం ఉద్దేశమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యంలో బుధవారం పర్యటించిన ఆయన ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి, పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, పెన్షన్లు తదితర పథకాల అమలుపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. గ్రామంలో 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, మరో విడతలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయని తెలిపారు. 317 చేయూత పెన్షన్లు ఉండగా మరో 30 కొత్త పెన్షన్లు గుర్తించినట్లు చెప్పారు. 372 కుటుంబాలకు గృహజ్యోతి, 500 కుటుంబాలకు గ్యాస్ సబ్సిడీ అందుతోందన్నారు. రైతు రుణమాఫీ కింద 285 మందికి రూ.2.35 కోట్లు, రైతుభరోసా కింద 641 మందికి రూ.3.62 కోట్లు అందించినట్లు తెలిపారు. మహిళా సంఘాలకు సున్నావడ్డీ, బ్యాంకు అనుసంధాన రుణాలు అందించినట్లు వివరించారు. పాఠశాల ప్రహరీ, ఓపెన్ జిమ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.

గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ, పరిహారం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఎంఎంఆర్ ప్యాకేజీ పెండింగ్ పనులను కూడా వేగంగా పూర్తి చేస్తామన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, పశుపోషణ, ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంటింటా ఇంకుడు గుంతలు, పొలాల్లో పంటకుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడంతో పాటు పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని కోరారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని సూచించారు. ముదిమాణిక్యం లంబాడిపల్లి బీటీ రోడ్డు, ఎల్లమ్మ చెక్‌డ్యామ్ వద్ద కాజ్‌వే లేదా వంతెన, ఏఎన్‌ఎం నియామకం, ఆర్టీసీ బస్సు సౌకర్యం, కాలువల సమస్యలను సర్పంచ్ బోయిని రమేష్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

అధికారి తప్పిదంతో 87 కుటుంబాలకు గృహజ్యోతి ప్రయోజనం అందడం లేదని తెలపగా, సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిని రమేష్, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేర్చుకోవడంలో నేనెప్పుడూ విద్యార్థిగానే ఆలోచిస్తా: ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 7: ఢిల్లీ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవా సంకల్ప జ్యోతి ప్రజ్వలన చేశారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన సేవా సంకల్ప యాత్రికులు కార్యక్రమానికి హాజరయ్యారు.

రాజకీయాల్లో పాలసీ మేకర్‌గా మోదీ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. సరిగ్గా 25 ఏళ్ల క్రితం గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి దేశ ప్రజల సేవలోనే తన పాతికేళ్ల ప్రయాణం కొనసాగిందని చెప్పారు.

### ప్రజల ఆశీర్వాదమే నాకు బలం..

25 ఏళ్లుగా నిరంతర ప్రజా సేవ అందించే అవకాశం తనకు లభిస్తుందని నాడు తాను ఊహించలేదని మోదీ అన్నారు. ఇంత సుదీర్ఘమైన ప్రజా సేవా ప్రస్థానంలో ప్రజల ఆశీర్వాదమే తనకు ప్రధాన బలంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకం, ఆశీర్వాదంతోనే తాను ముందుకు సాగుతున్నానని చెప్పారు. దేశ ప్రజల సేవలో గడిచిన ఈ పాతికేళ్లు తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైనవని మోదీ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు.

### ప్రజా సేవ చేసేందుకు భగవంతుడు నాకు శక్తినిచ్చారు..

ప్రజల ఆశీస్సులు, పార్టీ శ్రేణుల మద్దతే తనకు బలమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

దేశ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని ఎన్నటికీ మరచిపోలేనని పేర్కొన్నారు. ప్రజా సేవ చేసేందుకు భగవంతుడు తనకు శక్తినిచ్చారని, ప్రజలు, దేవుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తానని తెలిపారు. ప్రతి ఘటన నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నానని, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవాలనే తపనతో ఉంటానని మోదీ చెప్పారు. సవాళ్లే తనను మరింత బలంగా నిలబెట్టాయని, దేశం తనకు ఎంతో ఇచ్చిందని.. దేశమే తనకు ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

### నా ప్రత్యర్థులే నన్ను రాటుదేల్చారు..

నేర్చుకోవడంలో తాను ఎప్పుడూ విద్యార్థిగానే ఆలోచిస్తానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన తనకు ఉందని, ప్రతి ఘటన నుంచి ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తున్న సమయంలో విమర్శలు రావడం సహజమేనని, అయితే వాటిని పట్టించుకుంటూ కూర్చుంటే ముందుకు వెళ్లలేమన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించే వారి వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలేస్తానని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థుల విమర్శలు కూడా తనను మరింత రాటుదేలేలా చేశాయని, వారు ఎంతగా విమర్శిస్తే తాను అంతగా ఆలోచించేవాడినని మోదీ పేర్కొన్నారు. దేశం తనకు ఎంతో ఇచ్చిందని, అందుకే దేశమే తనకు ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. తనపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ప్రజా సేవలో ముందుకు సాగుతానన్నారు.

### ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోంది..

కలిసికట్టుగా పనిచేస్తే 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించగలమనే విశ్వాసం తనకు ఉందని ప్రధాని మోదీ అన్నారు. 'వికసిత్ భారత్-2047', టాప్-3 ఆర్థిక వ్యవస్థ, ఆత్మనిర్భర్ భారత్, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడం, అంతరిక్ష రంగంలో మరింత ముందుకు సాగడం వంటి లక్ష్యాలను సాధించేందుకు 'వీ విల్ డూ ఇట్' అంటూ ప్రతిజ్ఞ చేశారు. సంకల్పం ఉంటే దేనినైనా సాధించవచ్చని, దేశ ఆత్మవిశ్వాసాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోందని, దేశాభివృద్ధికి ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. పేదరికం, డ్రగ్స్‌ను దేశం నుంచి నిర్మూలించడం, అన్ని రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం వంటి పెద్ద లక్ష్యాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేశానని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగుతానని మోదీ తెలిపారు.

## రెండు డీఏలు విడుదల..



హైదరాబాద్, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త చెప్పింది ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 2024 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూలై 2024 నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచింది.

యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల ఉద్యోగులకు కూడా డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి డీఏ 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. అలాగే 2006 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 230 శాతం నుంచి 239 శాతానికి, జూలై 2024 నుంచి 239 శాతం నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

పెంచిన డీఏ అక్టోబర్ 2026 జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 33 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లించనుంది. అదే విధంగా జూలై 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లింపులు జరుపనుంది. డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## విమర్శ పారదర్శకంగా ఉండాలి - ఆచార్య సూర్య ధనంజయ్



మంగళవారం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో జరిగిన శ్రీమతి శైలజామిత్ర రచించిన 33 మంది కవుల కవితా విశ్లేషణ "ఆమ్లాన" గ్రంథం ఆవిష్కరణలో వైస్ ఛాన్సలర్ డా. సూర్య ధనంజయ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గడ్డం మల్లేశం, గ్రంథ రచయిత్రి శైలజామిత్ర, భర్త సత్యమిత్ర ఓఎస్‌డి. డా. విజయలక్ష్మి

హైదరాబాద్.. అక్టోబర్ 6:సమీక్ష అయినా, విమర్శ అయినా పారదర్శకంగా ఉండాలని ఆచార్య సూర్య ధనంజయ్ అన్నారు. సమకాలీన కవుల కవిత్వాన్ని విశ్లేషిస్తూ, వారి సాహిత్య ప్రస్థానాన్ని పరిచయం చేసేలా శైలజామిత్ర రచించిన 'కవితా విమర్శా వ్యాసాలు' "ఆవమ్లాన" అనే గ్రంథాన్ని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ప్రముఖ రచయిత్రి ఆచార్య సూర్య ధనంజయ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్య ధనంజయ్ మాట్లాడుతూ, ఇంతమంది సమకాలీన కవుల కవిత్వాన్ని పరిశీలిస్తూ, విశ్లేషణాత్మకంగా వ్యాసాలు రాయడం ఆసక్తికరంగానూ, ఆనందంగానూ ఉందన్నారు. ఇందుకోసం శైలజామిత్ర చేసిన కృషి అభినందనీయమని ప్రశంసించారు. 1990 నుంచి సాహిత్య సృజన చేస్తున్న కవులు, రచయితలు, రచయిత్రులను పరిచయం చేయాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. "బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చిన ఈ కాలంలో ఇలాంటి గ్రంథాలు ఎంతో అవసరం" అని ప్రముఖ కవి సి.నారాయణరెడ్డి (సినారె) చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. ఈ గ్రంథంలో మొత్తం 33 మంది తెలుగు కవుల కవిత్వంపై శైలజామిత్ర రచించిన విమర్శా వ్యాసాలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రవాసాంధ్రులు కూడా వుండటం, ఈ తరం కవులు కూడా వుండటం విశేషం అన్నారు. ఒక్కో కవితా విశ్లేషణ చదువుతుంటే రచయిత్రి ఎంతగా వారి కవిత్వాన్ని ఆమూలాగ్రం చదివారో అర్థమవుతోంది అన్నారు. దాదాపు 35 సంవత్సరాలుగా శైలజామిత్ర రచనల్ని గమనిస్తున్నానని, ఎన్నో ఏళ్ళుగా చేస్తున్న కృషిని అభినందించారు. ఈ గ్రంథావిష్కరణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరగడం ఆయా కవులకు, తనకు ఎంతో గర్వకారణమని శైలజామిత్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గడ్డం మల్లేశం, ఓఎస్‌డి డా. జి. విజయలక్ష్మి, సూర్య ధనుంజయ్ గారి వ్యక్తిగత కార్యదర్శి స్వాతి ఆకాంక్ష రెడ్డి, రచయిత్రి భర్త సత్యమిత్ర తదితరులు పాల్గొని శైలజామిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శైలజామిత్ర, సత్యమిత్ర దంపతులను విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్ ఘనంగా సత్కరించారు.






**చురక**

విపక్షాలు దేశమంతా
విస్తరించే పోరు మార్చ్
ఇండియా కూటమిగా
ఇదే ఐక్యతుంటే టార్చ్
సమస్యల పరిష్కృతిలో
సర్కారు వైఫల్యం
చేయగలదు ఎప్పుడైనా
సమరాలను సాఫల్యం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

శాత్రవుల క్రౌర్యమ్ము
సంహరించెడి దమ్ము
కలిగినది భరతమ్ము
అనును రాధశ్రీ !!
భావ గాంభీర్యమ్ము
శబ్ద సౌందర్యమ్ము
గల కవిత మధురమ్ము
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## రష్యాలో ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి.. 23 మంది ఇండియన్స్ సురక్షితం..!



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 7:రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య దాదాపు ఐదేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. తాజాగా నల్లసముద్రం లో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. రష్యా రిసార్ట్ నగరమైన సోచి సమీపంలో లైబీరియా జెండా తో వెళ్తున్న ఓ భారీ ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడికి పాల్పడింది. దాంతో ట్యాంకర్‌లో భారీగా మంటలు చెలరేగాయి. దాడి సమయంలో ట్యాంకర్‌లో ఉన్న సిబ్బంది మొత్తం భారతీయులే కావడం గమనార్హం.

దాడి జరిగినప్పుడు ఆయిల్ ట్యాంకర్‌లో ఉన్న 23 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా కాపాడినట్లు రష్యా రవాణా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇది భారత అధికారులకు కొంత ఊరట కలిగించే విషయమని తెలిపింది. 'నేవల్ డ్రోన్ల' ద్వారా ఈ దాడి జరిగిందని అధికారులు చెప్పారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది వాటిని అదుపు చేయలేకపోతున్నారని అన్నారు. ట్యాంకర్ నుంచి ముడిచమురు సముద్రంలోకి వ్యాపించి మండుతోందని, మంటలు కొంచెం తగ్గిన తర్వాత మళ్లీ ఆర్పే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సోచి నగరం సమీపంలో సముద్రంపై భారీగా నల్లటి పొగ, నారింజ రంగు మంటలు ఎగిసిపడుతున్నట్లు వీడియోల్లో కనిపిస్తున్నది. దాంతో సోచి నగర మేయర్ ముందుజాగ్రత్త చర్యగా తీర ప్రాంతానికి, బీచ్‌లకు ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించారు. అయితే నల్లసముద్రంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు.

2022లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరు దేశాలు వాణిజ్య నౌకలను టార్గెట్ చేస్తున్నాయి. కాగా రొమేనియా తీరంలో ఓ నౌక మునిగిపోయి ఒకరు మృతి చెందిన ఘటన జరిగిన మరుసటిరోజే ఉక్రెయిన్ ఈ డ్రోన్ దాడికి పాల్పడటం గమనార్హం. ఈ దాడి రష్యానే చేసిందని, అందులోనూ ఒక భారతీయ సిబ్బంది గాయపడ్డారని ఉక్రెయిన్ ఆరోపించింది. మరోవైపు రష్యా కూడా ఇటీవల ఉక్రెయిన్ ధాన్యాన్ని తరలిస్తున్న నౌకలపై దాడులు చేస్తున్నది.

తమ నగరాలపై రష్యా చేస్తున్న దాడులకు ప్రతీకారంగానే రష్యా చమురు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నామని ఉక్రెయిన్ వాదిస్తున్నది. ఇటీవలి వారాల్లో దాడులను తీవ్రతరం చేస్తామని ఇరుపక్షాలు ప్రకటించాయి.

గతంలో రష్యా లోని చమురు కేంద్రాలపై జరిగిన ఉక్రెయిన్ దాడులవల్ల సముద్రంలో ఆయిల్ స్లిక్‌లు ఏర్పడటం, బీచ్‌లను మూసివేయడం, ఆకాశం నుంచి విషపూరిత నల్లటి వర్షం కురవడం వంటి పర్యావరణ నష్టాలు సంభవించాయి. ఇప్పటి ఈ ఘటనతో మరోసారి అలాంటి ముప్పు పొంచి ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.







నేటి నిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com




# 'కృషితో నాస్తి దుర్భిక్షం' సూక్తిని రుజువు చేసిన నవల "చింతలచేను"

"కృషితో నాస్తి దుర్భిక్షం" అనే సూక్తి మనిషి జీవితానికి ఒక గొప్ప జీవన సత్యాన్ని చెబుతుంది. కృషి ఉన్నచోట కొరత ఉండదు; పట్టుదల ఉన్నచోట పరాజయం శాశ్వతం కాదు. ప్రతిభ మనకు ప్రారంభ బలం ఇస్తే, కృషి మనలను విజయతీరాలకు చేర్చే శక్తి. జీవితంలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. పరిస్థితులు అనుకూలంగా లేకపోవచ్చు. అవకాశాలు వెంటనే రాకపోవచ్చు. కానీ నిరంతరం ప్రయత్నించే మనిషి తనకు తానుగా అవకాశాలను సృష్టించుకోగల డు. అందుకే అదృష్టం కోసం ఎదురు చూడటం కంటే కృషిని నమ్ముకోవడం గొప్పది..." ఈ సత్యాన్ని రుజువు చేస్తూ ఎం దరికో ప్రేరణగా నిలుస్తూ...

ఆర్.సి. కృష్ణస్వామి రాజు కలంనుండి ఊపిరిపోసుకున్న ఒక వ్యవసాయదారుడి సజీవ జీవన చిత్రం ఈ 'చింతలచేను' నవల. ఈ రచన నిండు పౌర్ణమితో ప్రారంభ మవు తుంది. ముగింపుకు ముందు అన్నీ దట్టమైన చీకటీ కోణాలే. లెక్కలేనన్ని బాధలు దుఃఖం వేదికల మీదినుంచి పలకరిస్తాయి. కొన్ని సంవత్సరాల తరువాత అనూహ్యమైన మార్పులతో ఆమవాస్యను జయించిన కొత్తచంద్రుడి వెలుగులతో ఆనందంగా ఈ నవల ముగుస్తుంది. ఈ కథ ఒక సామాన్యరైతు జీవితానిది. కన్నీళ్ల బదులు రక్తం కారేలా దాడి చేసిన కష్టాలను జయించిన ఒక వీరుడి కథ ఇది. తనకు ఎదురైన ప్రతి విషమ సందర్భాన్ని ఒక తీర్థంలా స్వీకరించి విజయాలు సాధించిన ఒక సాహసకుడి కథ ఇది.

ఈ నవల ఒక మనిషి కథ కాదు. ఒక ఊరి కథ, ఒక ప్రాంతం కథ. చెప్పాలంటే ఒక మానవసమూహంలో ఒక సామాన్యుడి బాధలు, కష్టాలు, నష్టాలు, ఏడ్పులు, ఎదురీతలు, పోరాటలు, యుద్ధాలు, విజ యాలు, ఆర్థిక సంబంధాలు చివరికి సంతోషాలు ఇవన్నీ ఎలా ఎందరితో ఎన్నిరకాలుగా ముడిపడివుంటాయో వివరించిన కథ ఇది.

ఒక కుటుంబ యజ మానిగా తన బ్రతుకుకంటే తనవాళ్ల బ్రతుకుకోసం ఓర్పు, సహనాలను ఆయువులుగా నింపుకున్న కష్టజీవి గుణశేఖరుడు. మట్టిని నమ్ముకున్న ఈ మనిషికి తాను పండిస్తున్న పంటల్లో ఆశించిన ఫలితాలు శూన్యాలుగా మారి, జీవితాన్ని గడపటం కష్టసాధ్యంగా మారిన క్షణాలలో 'గుణశేఖరా... నీకు డ్రైవింగ్ తెలుసు కాబట్టి ఒక ట్రాక్టర్ కొని బాడుగకు తిప్పకూడదా... కలిసి వస్తే కోటశ్వరుడవు అయి పోతావు. ఆలోచించు' అన్నాడు ఇన్సూరెన్సు ఏజెంటు వెంకటముని. వినగానే ట్రాక్టర్ కొనటా నికి కావలసిన డబ్బు విషయం లో గుండె గుభేలుమన్నా, చివరికి వెంకటముని మాట తిరగులేని మంత్రంగా పని చేసింది. ఐదు లక్షలకు పైగా అప్పుచేసి ట్రాక్టరు కొన్నాడు గుణశేఖరుడు. ఎందుకోకాని అతనికి కాలం కలిసిరాలేదు. కుటుంబ తలరాతలు మారిపోతాయనుకున్న ఆశలు ఆవిరైపోయి, అనుకోని కష్టాలు విరామంలేకుండా తనమీద దండయాత్రకు క్రూరంగా సిద్ధమైపోయాయి. ఎంత పోరాడినా అపజయాలే వెక్కిరిస్తూ తనముందు నడిచేవి. అడుగువేస్తే ఏ ప్రమాదం తనని కబళిస్తుందోనని నిద్రలో సైతం ఉలిక్కిపడే స్థాయికి చేరుకు న్నాడు గుణశేఖరుడు.

అప్పులు తీర్చలేక వడ్డీలు తరగని కొండల్లా పెరిగిపోయాయి. సమస్యల మీద సమస్యలు వచ్చి చేరిపోయాయి.

వాటిని తీర్చే మార్గంలేక ఊపిరి కూడా తనతో సరిగ్గా సహకరించని స్థితికి గుణశేఖరుడు చేరిపో యాడు.

ఓ రోజున అప్పిచ్చిన సిద్ధిరాజు నానామాటలతో నీచంగా అందరి ముందు మాట్లాడి దానికితోడు అప్పుక్రింద ట్రాక్టర్ ని కోపంగా తోలుకొని వెళ్లిపోతాడు. ఆగని




ప్రతులకు:
కృష్ణస్వామి రాజు
సెల్:93936 62821

దుఃఖం శిథిలాల క్రింద ఆశల అవయువాలు తెగిపోతున్న గుణశేఖరుడికి 'చింత చేను' ఇప్పుడు 'చింతల చేను' లా కనిపించటం మొదలు పెట్టింది. మాటల్ని సైతం మరచిపోయి మూగవాడిగా నిలబడిపోతాడు. సరిగ్గా చినుకులు రాలుతున్న ఆ క్షణంలో ఆటో తోలుకుంటూ వెంకటముని తన దగ్గరకు వచ్చి 'కొత్త జీవితం ప్రారంభిద్దాం' అనగానే గుణశేఖరుడు ఉత్సాహంగా ఆటోవైపు అడుగులు వేస్తాడు. ఆ అడుగులే క్రమంగా వరుగుల్లా మారుతాయి. ఆ తరువాత ఏం జరిగిందో కాలానికి మాత్రమే తెలుసు. గుణశేఖర్ జీవితం ఎవరూ ఊహించని ఉన్నతమైన ఎత్తుల్లో కొనసాగుతుంది. కొడుకు మెకానికల్ ఇంజనీరుగా అశోక్ లేలాండ్ కంపెనీలో పెద్ద మేనేజర్ ఉద్యోగం చేస్తున్నాడు. తన భార్యతో పాటు తల్లి వొంటినిండా ఇప్పుడు మోయలేనంత బంగారం. తాను ఇప్పుడు ఏకంగా నాలుగు కొత్త ట్రాక్టర్లకు యజమాని మాత్రమే కాదు, ప్రస్తుతం ఆ ప్రాంతానికి ట్రాక్టర్ల డీలరు కూడా. ఇలా గుణశేఖరుడి కథ, కాలం సైతం విస్తుపోయే సుఖమయ తీరాల వైపుకు సాగిపోయింది. అందుకు సరైన బీజం వేసిన మనిషిగా వెంకటముని చాలా ప్రముఖంగా మెరుస్తాడు.

ఆర్.సి. కృష్ణస్వామి రాజు అందించిన ఈ 'చింతలచేను' నవలను చదవటానికి నా కళ్ళను ఇష్టంగా అప్పగించగానే, నేను అమాంతం చిత్తూరు జిల్లా పుత్తూరుకు దగ్గరలోనున్న రాసపల్లి గ్రామం మధ్యలోకి అమాంతం విసిరివేయబడ్డాను. మీనాక్షయ్య కొట్టులో టీ తాగాను. పంచె అంచు నోట్లో పెట్టుకుని సైకిల్ తొక్కుంటూ వచ్చిన తిమ్మాపురం పుట్టారెడ్డితో చాలా కబుర్లు పంచుకున్నాను. అలా వీధిలో నడుస్తావుంటే నల్లచారలున్న కుక్క నన్ను చూసి మొరగలేదు. ఏదో నాతో స్నేహమున్నట్లు నా వెనకే రావటం మొదలు పెట్టింది.

అలా నేరుగా గుణశేఖరుడి ఇంటికి నా నడక సాగింది. ట్రాక్టరు కొనడానికి సిద్ధపడ్డ కొడుకుతో నారాయణమ్మ 'ఒరేయ్ నాయనా... నేలమీద నడవరా, ఆశకు పోయి, ఉన్న గోచీని పోగొట్టుకున్నాడంట వెనకటికి నీలాంటి వాడు ఒకడు...' అంది. ఆ మాటలు గుణశేఖరుడికి రుచించలేదు. 'పోరాడితే పోయేదేమీ లేదు పేదరికం తప్ప' అంటూ ట్రాక్టరు కొనటానికే సిద్ధపడ్డాడు. 'బాగా కష్టపడాల్సి వస్తుందేమో కదండి' అంది భయపడుతూ భార్య హైమావతి. 'ఎగబడి పోరాడకుంటే తిరగబడవు మన బ్రతుకులు...' అంటూ తన నిర్ణయాన్ని మరోసారి గట్టిగా నిర్ధారణ చేశాడు. జీవితమంటే నిత్యం జరిగే ఒక యుద్ధమని, పోరాటం తప్పదన్న భావాన్ని చివరిదాకా తన శ్వాసకు తోడుగా నడిపించి, చివరకు ఊహించని విజయాన్ని తన సొంతం చేసుకుంటాడు గుణశేఖరుడు.

ఈ నవల కేవలం ఒక మనిషి జీవితాన్ని మాత్రమే మనకందించదు.

ఆ పల్లెనిండా పరుచు కున్న మట్టికణాల కనురెప్పల్ని తెరచి చూస్తే ఎన్నో పాత్రలు ప్రవాహంలా మనముందు హాజరవుతాయి. వడ్డీ వ్యాపారం మీద బ్రతికే సిద్ధిరాజు, వ్యవసాయం మీద పిహెచ్.డి చేస్తున్న సుమతి, కవిత్వం రాయడమంటే చాలా ఇష్టపడే నీలిరాజు, బీమా ఏజెంటుగా తిరిగే వెంకటముని, పుత్తూరు వైద్యుడు ప్రభాకరం, గొర్రెల్ని పెంచుకుని బ్రతికే వీరమరాజు, డ్రైవర్ కన్నదాసన్... ఇలా సందర్భాన్నిబట్టి సన్నివేశాల్ని బలంగా నడిపించటాని ఎన్నో పాత్రలు ఈ నవల రచనలో ఏకంగా రక్తకణాలుగా మారిన దృశ్యాలు రచయిత సామర్థ్యానికి సాక్ష్యాలుగా నిలబడుతున్నాయి. నవలలో ఈ పాత్రలు మాత్రమే కాదు, ఒకవై పు ధర్మరాజు గుడి, ఆ ప్రక్కన చెట్టుమీద ఆడుకుంటున్న ఉడతలు, వాటిముందు వినోదాన్ని ఆనందిస్తూ పిల్లలు, అలా వెళ్లితే అక్కడ నుదుట రకరకాల బొట్లతో ఒక జోస్యగాడు, రంగమామ చేతిలో నవనవలాడుతున్న నాలుగు జామకాయల కమ్మటి వాసన, దీనికితోడు హమీద్ మటన్ బిర్యాని గుమగుమలు, అలా దారిలో నడుస్తూవుంటే ఆ ప్రక్కన ఆరేటమ్మ గుడి, ఇంకాస్త ముందుకు వెళ్లితే సైకిల్ వెనక పెద్ద చీరల మూటతో వ్యాపారం చేస్తున్న వ్యాపారి చమత్కారపు మాటలు, అటువైపు పంచె ఎగ్గట్టి 'పచ్చగడ్డి కోసేటి పడచు పిల్లో' అంటూ ఆర్.ఎమ్.పి. డాక్టర్ పాడుతున్న పాట... ఇలా వందలాది విషయాలు ఈ నవలా నిర్మాణానికి వస్తుసామగ్రిలా తమ అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

అన్నిటికంటే ముఖ్యంగా మనతో కరచాలనం చేసి తన తలరాత బాధల్ని మనతో చెప్పుకునే పాత్ర గుణశేఖరుడు కొన్న ట్రాక్టర్ పాత్ర. నిజమే అది ఒక యంత్ర సమూ హమే కాని, మరో కోణంనుంచి చూస్తే దానికి కూడా మనసుంది. ట్రాక్టరుకు ప్రమాదం జరిగినప్పుడు తనకు జరిగిన నష్టంకంటే గుణశేఖ రుడి వొంటికి తగిలిన గాయాల గురించి చాల వ్యధ చెందుతుంది.

తన రాక గుణశేఖరుడికి లాభాలు తెచ్చిపెడుతుందనుకుంటే విపరీతమైన అవస్థలకు తాను ఒక కారణంగా నిలిచిపోతుంది. చివరికి జప్తు క్రింద అప్పులిచ్చినవాడు తనను తోలుకొని పోతూవుంటే గుణశేఖరుడి కోసం ట్రాక్టరు రోదించిన వేదన అదృశ్యంగా మన గుండెల్ని తాకుతుంది. కాలం గుణశేఖరుడికి పూర్తిగా అనుకూలించాక తిరిగి ఆ ఇంటికి చేరుకున్న ట్రాక్టర్ పొందిన ఆనందం, ఆ తరువాత నాలుగు కొత్తట్రాక్టర్లుగా మారడమే కాకుండా ఏకంగా గుణశేఖరుడ్ని ట్రాక్టర్ల డీలర్ని కూడా చేస్తుంది.

అందుకే 'చింతలచేను' కేవలం ఒక రైతు జీవితకథ కాదు; మట్టిని నమ్ముకున్న మనిషి మొక్కవోని ఆత్మవిశ్వాసానికి ప్రతీక. చీకటి ఎంత దట్టమైనా వెలుగు తప్పక వస్తుందనే జీవన సత్యాన్ని ఈ నవల ఆవిష్కరిస్తుంది. కష్టాలు మనిషిని కుంగదీయడానికి వచ్చినవే కాదు..అతని శక్తిని, సహనాన్ని, సాహసాన్ని పరీక్షించడానికి వచ్చినవని నిరూపిస్తుంది. కన్నీళ్లను చెమటగా, చెమటను విజయంగా మార్చుకున్న రైతు జీవితం ఈ నవలకు ప్రాణం. పౌర్ణమి వెలుగుతో ప్రారంభమైన ఈ జీవన ప్రయాణం అమావాస్య చీకట్లను ఛేదించి కొత్తచంద్రుడి వెలుగుతో ముగు స్తుంది. అదే ఈ నవల అందించే ఆశావహ సందేశం?కృషితో నాస్తి దుర్భిక్షం; పట్టుదలతో అసాధ్యం ఏదీ లేదు. 'చింతలచేను'లోని రైతు గెలుపు ఒక వ్యక్తి గెలుపు మాత్రమే కాదు; ప్రతికూలతలను ఎదురించి నిలబడే ప్రతి సామాన్య మనిషి గెలుపు.

ఈ నవలా చిత్రపటం ఇంతగొప్పగా సరికొత్త రంగులతో అందరినీ సమ్మోహనపరచటానికి కారకులైన రచయిత ఆర్.సి. కృష్ణస్వామి రాజు సాహిత్య కృషికి, ఆయన రచనా నైపుణ్య వైవిధ్యానికి హృదయపూర్వక అభినందనలు.



సాహిత్య ప్రపూర్ణ
**డాక్టర్ కె.జి. వేణు**
98480 70084

## సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
**సుధామ**
సెల్:9849297958

పూజనీయుడు,
మహనీయుడు

ప్రాణాలొడ్డి
ప్రయాణికులను
కాపాడిన స్మిత్
అభినందనీయుడు.
**-డి.వి.వి.ఎస్.మూర్తి**
హైదరాబాద్.

ఓర్చుకో
నేర్చుకో

సమాజానికి
ఉపయోగపడేలా
నీ పద్ధతి
మార్చుకో
**-కాయల నాగేంద్ర**
హైదరాబాద్

ఆవిడ
ఈవిడ

సలహాలు మాని
చెప్పినట్లు
విను
మీఆవిడ
**-అల్లంరాజు రాధా కుమార్**

విశ్రాంతి
ప్రశాంతి

ప్రతి మనిషికి
జీవితంలో
ఉండాలి
మనశ్శాంతి
**-తిప్పావఝుల నరసింహమూర్తి**
,నెల్లూరు జిల్లా

పనిమంతుడు
బుద్ధిమంతుడు

మనమేం
తక్కువ
మనలో దాగున్నాడు
హనుమంతుడు.
**-యదుగిరి క్రాంతి రామ్మోహన్ రావు**

నిత్యాలు
సత్యాలు

మంచితనం కల్గిన
మనుషుల
మాటలెప్పుడూ
ఆణిముత్యాలు!
**-గన్నోజు పద్మావతి**
పాలమూరు

గండ్లు
వడగండ్లు

అతివృష్టి
అనావృష్టిచే
కర్షకుల బ్రతుకుల్లో
కడగండ్లు
**-వి.సుబ్బారావు,** వైజాగ్.

కలదు
వలదు

అక్రమార్జన చేసి
సంపాదించిన
ధనము
నిలువదు
**-హైమ. కందుకూరి**
లండన్

నవ్వు
పువ్వు

ప్రేమిస్తున్న వారికోసం
అందమైన
రెంటినీ రువ్వు
**-మోదుగ బాలసుబ్రహ్మణ్యం**

ప్రాభవం
వైభవం

ఎన్నో ఆటుపోట్లు
తట్టుకుంటే
వస్తుందిఅనుభవం
**-దోర్బల మంజులత**
హైద్రాబాద్

## ప్లాస్టిక్ భాష!!

ఇప్పుడు మాతృభాషలో
మాట్లాడటం కాదు?
సరికొత్త అక్షరాలతో
మార్కెట్లో చలామణి అయ్యే
భాషలోనే తెల్లారుతోంది జీవితం!!.

బెడ్ కాఫీతోనే
ఓనమాలు దిద్దుకుని,
తెగ సంబరపడిపోతావ్?
చెయ్యి తడుపుడు లేదు,
కప్పు తోముడు లేదని!!.

వేడి వేడి పెసరట్టు,
ఉప్మా కలిసిన టిఫిన్
నాలుక మీద లాలాజలంతో
లోనికి జారుతుండగా?
పేగుల్లో ప్లాస్టిక్ వాక్యమొకటి
గురక పెడుతుంది!!.

ఈ భాష
ఖాజీపేటది కాదు?
కరీంనగర్‌ది కాదు?
ఏ ఊరి మట్టివాసనకూ
చెందదు!
పంటి మీద నలుగుతూనే
నమిలిన కొద్దీ బబుల్‌గమ్‌లా
తీగలు తీస్తుంది
ఆ తీగల్లో
మన మాతృభాష
బలి మేకలా
జడితిస్తుంది!!.

ఫంక్షన్‌లో
విస్తరాకులో
వ్యాకరణం ఎక్కడుంది?

లాగించిన బిర్యానీ
అసలు రంగు బయటపడగానే
కొత్త భాష పుడుతుంది?
పాటకు పల్లవి లాగా,
పళ్లెంలో పులావులా!!

దాహార్తిని తీర్చే
గ్లాసొకటి
చేతిలోకి రాగానే
ప్లాస్టిక్ పద్యం
లోనుంచి తన్నుకు వస్తుంది?
కానీ
యతి పడదు, మైత్రి కుదరదు,
మాటకు మనసుకు అంటుకోదు!!

'కద్దు కా కీర్'
ఊరిస్తూ ఎదురొచ్చిన
బౌల్ ముందు
నీ పాత మాటలన్నీ
పుల్లాకు విస్తరిలా
మడతపడిపోతాయి!!

యుగం ఏదైనా?
భాష మాత్రం ప్లాస్టిక్‌దే!
గిట్టుబాటు డాలర్‌దైనా,
చెల్లుబాటు మాత్రం
దీనిదే!!

పదకోశాలు పేర్చి
అర్థాలు చెప్పే
నిఘంటు సృష్టికర్తలకే
అందని లోతులు
ఈ ప్లాస్టిక్ భాషలో!!

పదం ఉంది?
పదార్థం లేదు
శబ్దం ఉంది?
స్పందన లేదు;
వ్యాకరణం ఉంది?
వ్యవహారం లేదు
భాష ఉంది?
భావం లేదు!!

గుండె చప్పుడు లాంటి
మన భాష
ప్రపంచ జనాభాకు అందక?
ప్లాస్టిక్ శబ్దమంజరి కోసం
అమెజాన్‌లో ఆర్డర్ వేసారు!!
డెలివరీ వచ్చేసింది?
ప్యాకింగ్‌లో
మన మాతృభాష లేదు!!

ఏదో ఒక రోజు
ఉదయం పీల్చే
శ్వాసకూ
ప్లాస్టర్ పడక తప్పదు?

ఎందుకంటే
మనం భాషను మాత్రమే కాదు
బతుకును కూడా
ప్లాస్టిక్‌లో
ప్యాక్ చేస్తున్నాం!!



**-కె. ఎస్. అనంతాచార్య**
9441195765

## కౌమార క్రిటిక్కులు-1






- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

ఓ పెద్దాయన మా దగ్గరికి దాదాపు వంద పుస్తకాలు తీసుకుని వచ్చాడు. అప్పుడు నేనూ, అన్య, విదూలం కథల గురించి మాట్లాడుకుంటున్నాం.

"మీకు బాగా గుర్తున్న కథను చెప్పాలి" అని మేం ఎవరికివారు అనుకున్నాం. అది తెలుగు కథ మాత్రమే కానవసరం లేదు. ఏ భాషలో వచ్చిన కథ అయినా కావచ్చు. అంతేకాదు, ఇకముందు అలాంటి గొప్ప కథలను సేకరించి మేము మా దగ్గర ఓ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కూడా అనుకున్నాం.

మరీ పెద్దాయన ఇన్ని పుస్తకాలు తీసుకురావడంతో మాకు బోలెడంత సంతోషం కలిగింది.

"మాకు ఇవన్నీ డొనేట్ చేస్తున్నారా?" అన్నాను.

ఆయన చిన్నగా తలూపారు. తర్వాత చిరునవ్వు నవ్వారు.

"ఓ రకంగా డొనేషన్ లాంటిదే! అయితే మీకు చిన్న పని పెడుతున్నాను" అన్నారాయన.

"ఇవన్నీ మేము చదవాలి. తర్వాత నోట్స్ రాయాలంటారా?" అంది అన్య.

"మిమ్మల్ని చూస్తే ముచ్చటగా వుంది అమ్మాయ్! ఎదుటివారి మనసును ఇట్టే చదువుతున్నారు. మిమ్మల్ని క్రిటిక్స్ గా మార్చాలి అనుకుంటున్నాను. మీరు ఈ పుస్తకాలు చదవాలి. తర్వాత నోట్స్ రాయటం కాదు, వీటి మీద సమీక్ష రాయాలి. అది మీకు ఇస్తున్న హోంవర్క్" అన్నారాయన.

"మేం ఇలాంటి పనులు చేస్తామని మీకు ఎవరు చెప్పారు?" అన్నాడు విదూ. వాడి ముఖంలో అప్పటికే కలర్స్ మారుతున్నాయి.

"అదేంటి బాబూ, మీ గురించి మీరు తక్కువ అంచనా వేసుకుంటున్నారు! ఇప్పుడు మీరు పాపులర్ అయ్యారు. త్వరలో మీ నుండి కథల సంకలనాలో, సంపుటులో వస్తున్నాయట! పెద్దవాళ్ళు రాసిన కథలు, నవలలు మీరు చదవటం ఏంటి? అది నిన్నటి వరకు జరిగింది. ఇప్పుడు పిల్లలు రాస్తారు. అవి పెద్దవాళ్ళు చదవాలి. అంతే కాదు, మీ మీద, మీ పుస్తకాల మీద పెద్ద వాళ్ళు, రచయితలు సమీక్షలు చేయటం ఏమిటి? ఆ పని మీరు చేయాలి. మీరు ఎప్పుడూ కథలు వినేవారుగా, రాసేవారుగా మాత్రమే వుంటారా? వుండాలా? అందులోనూ ఇది జెన్-జీ ఉద్యమాల రోజులు కదా! మీ గురించి మిస్టర్ క్లీన్ గారు అంటుండగా..."

"మా మెంటార్ ఈ విషయాలు మీకు చెప్పారా?" అన్నాను.

"చెప్పలేదు. మాకు రకరకాల సోర్సెస్ వుంటాయి పిల్లలూ! వారి అభిప్రాయాలు చదువుతుంటాం. వింటుంటాం. వాటి సారం తెలుసుకుంటాం. ఏమైనా వారు మంచి పని చేస్తున్నారు. వేం వాటిని ముందుకు తీసుకువెళ్తాం. మీరు కూడా మాకు సహకరించాలి" అన్నారాయన.

"విమర్శ అంటే అంత చులకన అయిపోయిందా సారూ?" అంది అన్య.

"అదేంటి అమ్మాయ్! అంత మాట అన్నావు. విమర్శ మీద గౌరవం వుంది కాబట్టే నా సైకిల్ వెనకాల ఇన్ని పుస్తకాలు మూటగా కట్టి తీసుకువచ్చాను."

"అయ్యా, మేము ఇంతవరకు కథలు వినటం, చదవడం తప్ప రాయటం మొదలుపెట్టలేదు. ఇప్పుడే మంచి కథలను సేకరించాలనుకుంటున్నాం. అసలు కథ చదివాక, బాగుందనో, బాగోలేదనో అంటాం. ఎందుకు బాగుండలేదు? ఎందుకు బాగుందో చెప్పమంటే మేమేం చేయాలంటారు?" అని అడిగాను.

"ఎవరు మేంగో మిమ్మల్ని అడిగేది?"

"సారూ... కథలో, కాకరకాయలో చదివి మాలో మేం మాట్లాడుకుంటే ఎవరూ ఏమీ అనరు. మమ్మల్ని సమీక్ష చేయమంటున్నారు. అప్పుడు మా ఏజ్ ఎంత? మా గేజ్ ఎంత? మాకు కథ గురించి ఏం తెలుసు? మీరు ఎన్ని కథలు చదివారు? అసలు కథ లక్షణాలు మీకు తెలుసా? అంటే మేం నోళ్ళు వెళ్ళబెట్టాలా? ఏంటి సారూ మా మీద ప్రయోగాలు?" అంది అన్య.

"ఇదేదో మీరు మమ్మల్ని అన్ పాపులర్ చేయడానికి చేస్తున్న కుట్రలా వుంది" అంటున్నాను.

ఇంతలో విదూ, అన్యలు ఆ పుస్తకాల మీదకు లంఘించారు. వాటిని సెపరేట్ చేయటం మొదలుపెట్టారు. సగం పైగా కవిత్వం పుస్తకాలు వున్నాయి. మిగతావి కథలు, కొన్ని నవలలు. ఇంకా విమర్శకు చెందినవి మూడు నాలుగు కనిపించాయి.

"పెద్దాయనకి విమర్శ మీదే చిన్నచూపు అనుకున్నాను. కథల మీద, కవిత్వం మీద, నవల మీద కూడా అదే చూపు వుంది" అంది అన్య.

"ఏంటి పిల్లలూ... మీరు నా మీద దాడి చేస్తున్నారు! అసలు మీరు పుస్తకాలు తెరవలేదు. అట్టలు చూసి జడ్జ్ చేస్తున్నారు. మీకు తెలుసు కదా... కవర్ పేజీ చూసి తీర్పులు ఇవ్వకండి అనే సామెత వుంది" అన్నారాయన.

"అయ్యా! ఆ పని చేస్తున్నది మీరు. మేమేంటో మాకే తెలియదు. మీరు మాత్రం మా మనసుల్లోకి దూరామనుకుంటున్నారు. 'మీరు విమర్శకులు అవండి' అని జడ్జ్మెంట్ ఇచ్చేసారు. మీరు అలా అనగానే ఎగిరి గంతేస్తామనుకున్నారా? ఒకటి కాదు, రెండు కాదు... వంద పుస్తకాలు మా ముఖాన కొట్టారు. వీళ్ళకు అవగాహన ఎంత వుంది? నిజంగా వీళ్ళను క్రిటిక్స్ గా మార్చాలనుకుంటే ముందుగా వీరికి శిక్షణ తరగతులు పెట్టాలి అనుకున్నారా? ఇదా మీరు సాహిత్యానికి చేసే సేవ?" అన్నాను.

"పిల్లలూ! మీరు కాస్త తేడాగా వున్నారు. అన్నీ తెలుసుకున్నాక పనులు చేయాలంటే కుదరదు. డాక్టర్లు కూడా ఓ నలుగురిని చంపాకగాని రాటుదేలరు. రోగులు చనిపోతారని వైద్యం మానేస్తానంటే కొత్తగా డాక్టర్లు పుడతారా? అయినా, ఇప్పుడు సమీక్ష రాసేవారంతా జ్ఞానంతో రాస్తున్నారా? రచయితలు, కవులు వేలల్లో పుట్టుకొస్తున్నారు, మరి విమర్శకులు పదుల్లో కూడా తయారవ్వడం లేదు. అందుకేగా కవులే ఇతర కవుల్ని, రచయితలే ఇతర రచయితల్ని, రచనల్ని కమ్ముకుంటున్నారు. ఇది అనివార్యం పిల్లలూ" అంటున్నారాయన.

ఇంతలో విదూ, అన్యలు ఏదో అనబోయారు.

"మధ్యలో జోక్యం వద్దు పిల్లలూ! మీకు కురుక్షేత్ర యుద్ధం గురించి తెలుసు. అందులో శ్రీకృష్ణ, అర్జునుడి గురించి తెలుసు. ఎదురుగా వుంది సొంత మనుషులు, దాయాదులు. వారి మీద బాణాలు వేయను అంటే, వాళ్ళు వేస్తారు. కత్తులు దూస్తారు. రక్తాలు పారిస్తారు. అందువల్ల నీ పని నువ్వు చేయమని శ్రీకృష్ణుడు ప్రవచించాడు. అందువల్ల మీరు ఎలాంటి సంకోచాలు పెట్టుకోవద్దు. రాసేయండి, సమీక్షలు రాసేయండి. అందువల్ల మీకు పోయేదేం లేదు" అన్నారాయన.

"ఏమీ లేదా?" మరో ఆశ్చర్యం.

"ఏముంటుంది నాయనా? పైపెచ్చు మీకు అభినందనలు తప్ప సంకెళ్ళు వేస్తారా? మీ తాతల వయసువారు కూడా మీకు కృతజ్ఞతలు చెబుతారు" అంటున్నాడు.

ఇంతలో మిస్టర్ క్లీన్ ఎంటరయ్యాడు.

(సశేషం)

# నలభై ఏళ్ళుగా సాహిత్య పరవళ్ళు తొక్కుతున్న మంజీరా

## – మరసం 40 ఏళ్ల సభలో మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 7: కవులు అంటే కవిత్వాన్ని వెలువరిం చేవారు మాత్రమే కాదని మాటకు, పాటకు, ఆటకు ప్రాణం పోసే వారని క్రియాశీలకంగా నిరూపిస్తున్న మంజీరా రచయితల సంఘం భావితరానికి దిక్సూచి అని మాజీమంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో, గోపాల్ రెడ్డి వేదికపై శుక్రవారం జరిగిన మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల వార్షికోత్సవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం అంటే వేడుక కాదని ప్రజాపక్షంలో నిలబడడమని మరసం నిరూపించడం చారిత్రాత్మకమని చెప్పారు. 40 ఏళ్లు సాహిత్య సంస్థ నడిపించడం కత్తి మీద సాము లాంటిది చెప్పారు. నిర్బంధాలను, బెదిరింపులను, రాజ్య హింసను తట్టుకొని నిలబడిన మరసం సామాజిక సమస్యల పరిష్కారాన్ని భుజాల మీదికి ఎత్తుకున్నదని తెలిపారు .మంజీరా రచయితల సంఘం లేకుంటే తెలంగాణ ఉద్యమం ప్రజ్వరిల్లేది కాదన్నారు. కవులను, రచయితలను, కళాకారులను, జర్నలిస్టులను ఏకం చేసి ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఘనత మరసం దని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నగదు, ప్లాటును తిరస్కరించిన త్యాగశీలి, "నాగేటి సాలల్ల నా తెలంగాణ" పాటతో ప్రజల్లో ఎనలేని చైతన్యం కల్పించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి, మాట, ఆట,పాటలతో ఉద్యమాన్ని ఉరకలెత్తించిన దేశపతి శ్రీనివాస్ , 41 రోజుల సకల జనుల సమ్మె భేరితో పాలకులను కదిలించిన దేవి ప్రసాద్, జర్నలిస్టులను ఉద్యమం లో భాగస్వాములను చేసిన విరాహత్ అలీ కృషి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాదిరాళ్లని వివరించారు. మరసం సుదీర్ఘ ప్రస్తానానికి నిబద్ధతతే ప్రాణమన్నారు. భావితరానికి సరికొత్త స్ఫూర్తిని అందించాలని పిలుపునిచ్చారు. సాహిత్యంలో ఏఐ ప్రవేశిస్తుందని అయినప్పటికీ హృదయం పెట్టి మట్టి వాసనలతో రాసిన కవిత్వం, సాహిత్యం మాత్రమే సజీవంగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు . పాశ్చాత్య దేశాల్లో అన్ని వర్గాల వారు పుస్తక పఠనం వైపు మరలుతుంటే మన దేశంలో ఉయ్యాలలుగే పిల్లల సైతం సెల్ ఫోన్లలో ఊగడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. పుస్తక పఠనాన్ని పెంపొందించాలని కోరారు .కాంగ్రెస్ ప్రభుత్వానికి సాహిత్యం పై ప్రేమ లేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే తెలంగాణ అకాడమీ ఏర్పాటు చేయడం ,ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచం నలుమూలల చాటడం జరిగిందని వివరించారు. కాగా మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రభుత్వం తెలంగాణ అకాడమీ కి తాళం వేయడం, వారి సాహిత్య నిర్లక్ష్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజీరా నదిలోని చుక్క నీటిని వాడుకునే అవకాశం, ఒక్క చెక్ డాం ను నిర్మించే ప్రయత్నం జరగలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే మంజీరా నదిపై చెక్ డ్యామ్ లను నిర్మించిందని , ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీడు పడ్డ భూములను పచ్చగా మార్చిందని వివరించారు.



లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు అలాజీపూర్ కిషన్, డా॥ నాళేశ్వరం శంకరం, కొమురవెల్లి అంజయ్య, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కలకుంట్ల రంగాచారి, పూర్వ అమాత్యులు, సిద్ధిపేట శాసనసభ్యులు హరీష్ రావుమాణిక్ రావు, డా॥నందిని సిధారెడ్డి,విరాహత్ అలీ, దేవిప్రసాద్, భగవాన్ రెడ్డి,పప్పుల రాజిరెడ్డి, తోట అశోక్.



సభలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి, శాసనసభ ఉపనేత తన్నీరు హరీష్ రావు

### మరసం వ్యక్తి కేంద్రం కాదు..విషయ కేంద్రం
### – ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

మంజీరా రచయితల సంఘం వ్యక్తి కేంద్రంగా పనిచేయలేదని వస్తువు , విషయము కేంద్రంగా పనిచేస్తుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చెప్పారు. ఒక లక్ష్యంతో, ఆశయంతో నడుస్తుందని చెప్పారు. ఉద్యమాలకు ఆటగా , మాటగా, గొంతు గా మారిందని తెలిపారు.విభిన్న వ్యక్తులను, భావజాలాలను , సంస్థలను ఒక వేదికపై తీసుకువచ్చి నడిపించిన ఘనత మరసందని తెలిపారు. తన సాహిత్య, సాంస్కృతిక వికాసానికి మరసం పునాది పరిచిందని తెలిపారు . బెల్లీ లలిత లాంటి అద్భుత కళాకారులను మరసం వెలుగులోకి తీసుకొచ్చిందని తెలిపారు.



సభలో ప్రసంగిస్తున్న విరాహత్ అలీ

### మరసం ఎప్పుడూ పీడితుల పక్షమే – కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి

మంజీరా నది స్ఫూర్తితో ప్రారంభమైన మంజీరా రచయితల సంఘం ఎప్పుడు ప్రజల పక్షమే వహిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మరసం వ్యవస్థాపకులు, కవి రచయిత డాక్టర్ నందిని సిద్దారెడ్డి స్పష్టం చేశారు. నిర్బంధాలను, అవరోధాలను ఎదుర్కొంటూ అన్ని వర్గాల వారికి వేదికగా నిలుస్తుందని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు మరసం ప్రేరణగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజలతో, పల్లెలతో మరసం మ మైకమైందని చెప్పారు. మరసం కవులకు, రచయితలకు, కళాకారులకు, జర్నలిస్టులకు స్ఫూర్తి నింపిందని తెలిపారు.

> ఒక సాహిత్య సంస్థ 40 ఏళ్ళుగా కొనసాగటం మామూలు విషయంకాదు. ఇంతటితో ఆగిపోలేదు ఇంకా ఉధృతంగా ముందుకు దూసుకుపోవటానికి సిద్ధంగానే ఉంది. ఇన్నేళ్ళుగా ఎన్ని మహత్తరమైన సభలు, ఎన్ని మహోన్నతమైన కవిసమ్మేళనాలు, ఎన్నెన్ని ఉద్యమాలు , ఎన్నెన్ని సాహిత్య చర్చలు. బోలెడన్ని జ్ఞాపకాలు, బోలెడన్ని సన్నివేశాలు ఒక సాహిత్య సంస్థ నలభైఏళ్ళు చిన్న విషయం కాదు.
>
> మంజీరా నది ఉత్తుంగ తరంగాల్లాంటి మహా కవుల ప్రసంగాల పరంపరలు, మంజీరా తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ఎలిగెత్తి చాటుతున్న తెలంగాణకు ఒక సాహిత్య స్వరం.
>
> **మంజీరా నది అంటే**
> **ఏడుపాయల జాతరా !**
> **సంఘం మంజీరాంటే**
> **నీళ్ళే కాదు రాతరా !**
>
> 
>
> –కందుకూరిశ్రీరాములు

### మాది తల్లి బిడ్డల అనుబంధం
### – టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీ

మెతుకుసీమలో మంజీరా రచయితల సంఘంతో జర్నలిస్టులకు తల్లి బిడ్డలకు ఉండే బంధం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ తెలిపారు. మరసం కవుల రచనలు వార్తలుగా , జర్నలిస్టుల వార్తలు కవితలుగా మారినట్టు పేర్కొన్నారు. ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని, ప్రజల గొంతుకగా నిలబడి, మరసంతో కలిసి జర్నలిస్టుల సంఘం పోరు చేసినట్లు ఆయన తెలిపారు. మరసం అందించిన స్ఫూర్తి తోనే 25 ఏళ్ళ క్రితం జర్నలిస్టుల బతుకులపై తాము "కలం రాగాలు" ఆడియో క్యాసెట్ ను నిర్మించినట్లు విరాహత్ చెప్పారు. జిల్లాలో జర్నలిస్టులు నిర్బంధాలను ఎదుర్కోవడంలో మరసం అండగా నిలిచినట్లు చెప్పారు.

### స్తబ్దతను బద్దలు కొట్టాలి – టీఎన్జీవోల సంఘం పూర్వ అధ్యక్షులు దేవి ప్రసాద్

సమాజంలో పెరుగుతున్న స్తబ్దతను కవులు, రచయితలు బద్దలు కొట్టాలని టిఎన్జీవోల సంఘం పూర్వాధ్యక్షులు దేవి ప్రసాద్ పిలుపునిచ్చారు. మేధావుల మౌనం ప్రమాదకరమన్నారు. సంక్షోభాలను అధిగమించడానికి పోరాటాలు కావాలన్నారు. మరసం ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలబడిందని తెలిపారు. మహాసభకు మరసనీ అధ్యక్షులు రంగాచారి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి సిద్ధంకి యాదగిరి నివేదిక సమర్పించారు. సమావేశంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరం శంకరం, సీనియర్ పాత్రికేయులు కే అంజయ్య, తోట అశోక్, కవులు పపప్పుల రాజిరెడ్డి, అలాజిపూర్ కిషన్, భగవాన్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు ప్రెస్ క్లబ్ ముందు మరసం జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. మహా కవులను, రచయితలను స్మరించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహాసభకు తెలంగాణ నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు హాజరయ్యారవ్వడంతో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ కిక్కిరిసిపోయింది.

### చైతన్యాన్ని అందించిన వక్తల ప్రసంగాలు

మరసం 40ఏళ్ళ వార్షికోత్సవ సందర్భంలో అంశాలపై నిర్వహించిన సాహిత్య సభలు సభికులను ఆలోచింపజేసాయి. సాహిత్యం – మహిళా దృక్పథం అంశంపై సాహిత్య విమర్శకురాలు నెల్లుట్ల రమాదేవి, సాహిత్యం – దళిత దృక్పథం అంశంపై కోయి కోటేశ్వరరావు, సాహిత్యం – ద్రావిడ దృక్పథం అంశంపై జిలుకర శ్రీనివాస్ లు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో 30మంది కవులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి



సభలో ప్రసంగిస్తున్న దేశపతి శ్రీనివాస్



సభలో ప్రసంగిస్తున్న కొయి కోటేశ్వరరావు, నెల్లుట్ల రమాదేవి, దేవిప్రసాద్





---



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

'ఈ వారం వచన కవితల వర్క్ షాప్... అంశం "గాంధీజీ". విజేతల కవితలు చదవండి.

–డా॥రావి రంగారావు 9247581825

–సంపాదకులు

### ధ్రువతార – మహాత్ముడు

ఆకాశం నుండి ఉద్భవించిన ధ్రువతార
భూమి నిండా వెలుగులు పరిచింది!
మనుషులతో చెలిమి చేసి,
మనుషులలో మనిషిగా మారిపోయింది.
నిరాడంబరతకు నిండు రూపమై
అన్యాయాలను కూల్చే పోరాట
దీప్తిని లోకాన వెలిగించింది!
సత్యసాధనం ఉక్కు సంకల్పమై
చేతి కర్ర సాయంతో
శత్రువులకు చెమటలు పట్టించింది.
కలంతో సృజనయై, రాట్నంతో గానమై
కాలం విలువను శంఖంలా పూరించి
బ్రిటిష్ గుండెలను కదిలించింది!
ఆ చిరునవ్వుల వెన్నెల
ఆలోచనలలో శాంతిని నిలిపి,
అడుగులు కలిపి
అహింసా మార్గాన నడిపించి,
ప్రేమ, క్షమల కళ్లద్దాలతో లోకాన్ని నిరీక్షించి
భాష భావాలను పిల్లనగ్రోవిగ మలచి
ఐక్యత రాగం ఆలపించి
బానిస సంకెళ్ళను తెంచింది.
సహృదయతను పంచుకొని
సోదర భావం పెంచుకొని
భారతమాత మెడలో హారంగా వెలగాలని
గీతా బోధ చేసింది ఆ ధ్రువతార!
ఆ ధ్రువతార శాంతి మంత్రం,
పోరాట స్ఫూర్తి
ప్రపంచ దేశాలకు ఆదర్శమయింది
విస్తరించిన బ్రిటీష్ విష వృక్షాన్ని
వేళ్ళతో సహా పెకలించింది
దేశ శిరస్సున మువ్వన్నెల
జెండా రెపరెపలాడింది..
దేశానికి గ్రామాలే మణిమాణిక్యాలని
స్వయం సమృద్ధే మన జీవనాడి అని
దురాశను తీర్చే శక్తి ప్రకృతికి లేదని
అవసరాల మేరకే జీవిస్తేనే మనుగడ అని
బోధించింది ఆ ధ్రువతార!.
ఆ ధ్రువతార మహాత్ముడై, జాతి రత్నమై
నిత్యం దారి చూపే బాపూగా
అందరి హృదయాల్లో
అజరామరమై నిలిచాడు.

**–బి . కోమల సత్యవతి**
9989963383

### జాతికి వెలుగు దీపం...

చేతిలోని గుండ్రని కర్ర
చరిత్రను మార్చే ఆయుధమైంది
బోసి పెదవుల ఆ చిరునవ్వు
కోటలను కూల్చే శక్తియింది!
నూలు దుస్తుల సాదా రూపం
శాంతి సమరంలో గెలుపు జెండా
అడుగులు పడిన ప్రతి చోటా
దాస్యపు సంకెళ్ళు తెగిపడే!.
నడుముకు వేలాడే చిన్న గడియారం
కాలానికి నూతన దిశ చూపింది
నిరాడంబరమైన నీ జీవితం
మానవత్వానికి శిఖరమైంది!
సత్యం అహింసల మార్గంలో
పరాయి పాలనను ఎదిరించావు
భుజం మీది నూలు కండువాతో
స్వదేశీ మంత్రాన్ని ఊదావు!.
చీకటి బాటలో వెలుగు రేఖవై
భావితరాలకు బాటలు వేసి
కత్తుల వంతెన దాటిస్తూ
శాంతి గీతం ఆలపించావు!
తరాలు మారినా యుగాలు గడిచినా
నీ ఆలోచనల ఆరని జ్వాల
భారతావని గుండెల్లో నిరంతరం
వెలిగే
బోసినవ్వుల యుగ పురుషుడివి

**–బాబురావు చల్లగాలి,**
9941469728

### సత్య మార్గం– బాపు బాట

సత్యాన్నే శ్వాసగా మలచి,
అహింసనే ఆత్మబలంగా ధరించి,
దాస్యపు చీకట్లను చీల్చి
స్వేచ్ఛా ప్రభాతాన్ని ఆవిష్కరించి,
కొల్లాయి గుడ్డలో స్వదేశ
ఆత్మగౌరవాన్ని కప్పుకున్నావు!.
రాట్నం తిరుగుడులో
స్వావలంబన గీతం పలికి,
చేతికర్ర ఆసరాగా చరిత్రకు
కొత్త దిశ చూపి,
పల్లె నుంచి పట్నం దాకా
ప్రజల గుండెల్లో
సంకల్పం రగిలించి,
స్వదేశీ స్ఫూర్తికి నడిచే
ప్రతిరూప మయ్యావు!.
దక్షిణాఫ్రికా నేలపై సత్యాగ్రహ
జ్వాలను రగిలించి,
చంపారన్ మట్టిలో రైతు
కన్నీటి భాషను పలికి,
ఖేడా రైతుల వేదనకు
అండగా నిలిచి,
నలిగిన గొంతులకు
పోరాట పిలుపయ్యావు!,
పిడికెడు ఉప్పులో
స్వాతంత్ర్య స్వప్నాన్ని నింపి,
దండి తీరాల వైపు సముద్ర
కెరటాల సాక్షిగా సాగి,
ఉప్పు రేణువునే తిరుగుబాటు
ప్రతీకగా మలిచి,
సామ్రాజ్య గర్వానికి
నిరాయుధంగా సవాలు విసిరావు!.
కులమతాల గోడలకు
మానవత్వపు తలుపులు తెరిచి,
కన్నీటి చారికల్లో
కరుణను దర్శించి,
సేవకు త్యాగమే సారమని
నీ జీవితం చాటిచెప్పి,
మనిషిని మనిషిగా చూడటమే
మహోన్నత ధర్మమని నేర్పావు!.
ఒక తుపాకీ గుండు
నీ దేహాన్ని
నేలరాల్చినా,
నీ ఆశయం తరతరాల
హృదయాల్లో
మళ్లీ మళ్లీ మొలిచింది;
అన్యాయాన్ని ఎదిరించే
ధైర్యంలో,
పరుల కన్నీటిని తుడిచే
చేతుల్లో,
నిశ్శబ్దంగా నడిపించే
ప్రేరణగా
నీ వింకా జీవిస్తున్నావు!
సత్యమే నీవు చూపిన
మార్గం,
అహింసే నీవు నడిచిన
బాట,
తరతరాల హృదయాల్లో
చెరగని
దీపమై మిగిలిన
నీ సందేశం?
సత్య మార్గం?
బాపు బాట!

**–పేర్లి దాసు,** 9963249775

### నీలో ఎంత గాంధీ ఉన్నాడో!

అతని మాట సత్యం
అతని నడక అహింస
అతని మౌనం ఒక ప్రశ్న
అతని సహనం
ఒక జాతి విజయం
కలియుగంలో
కదిలే దైవం బాపు.
మనిషిని
మనీషిగా మార్చిన
చరిత్ర బాపు.
బానిస బతుకులపై
చేసిన
స్వాతంత్ర్య సంతకం...
బాపు.
భారతీయుల కన్నీటిని
తుడిచిన
బోసినవ్వు...
బాపు.
చిన్న మాటలతో
పెద్దసత్యాన్ని చెప్పిన
మినీకవిత బాపూ...
కానీ...
నీలో
ఎంత గాంధీ ఉన్నాడో
చెప్పేది
నీ మాటలు కాదు...
పక్కనోడి కష్టానికి
నీ కళ్ళు
కన్నీరైతే...
తోటి మనిషి ఆకలికి
నీ కడుపు
ఉపవాసమైతే...
ద్వేషం
నీ ముందుకొచ్చినప్పుడు
ప్రేమే
నీ సమాధానమైతే...
మాటలకు
సంకెళ్ళు వేసినప్పుడు
నీ పెదవులు
స్వేచ్ఛను పలికితే...
స్వార్థం
అధికారంగా
మారుతున్నప్పుడు
నిస్వార్థం
నీ వినయమైతే...
అప్పుడే...
నీ లోపల
ఒక గాంధీ
నడక మొదలుపెడతాడు
ఎక్కడో పుట్టిన
గాంధీ కాదు...
ఎప్పుడో చరిత్రలో
మిగిలిపోయిన గాంధీ కాదు
నీ మనసులో
మళ్ళీ పుట్టిన గాంధీ.

**–వై. శివకుమార్**
9989385898

---

### ప్రతి ఉదయం పునర్జన్మ

జననం వెనుక మరణం, మరణం వెనుక జన్మ
జీవిత చక్రంలో సాగుతుంది ఈ కర్మ .
కర్మల ఫలితమే జన్మకు కారణమని నమ్మకం
మంచి పనుల బాటే జీవితానికి సార్థకం.
తప్పును తెలుసుకుని దిద్దుకోవడమే మార్పు
చెడును విడిచిపెట్టి మంచిని ఎంచుకోవడమే నేర్పు
నిరాశను వదిలి ఆశను పల్లకిలో సాగిపో!
ప్రతి రోజూ కొత్త ఆశతో కదిలిపో!.
స్వార్థాన్ని వదిలి సేవను ఎంచుకో
అజ్ఞానాన్ని వీడి జ్ఞానాన్ని పంచుకో.
పడిన చోట లేచి ముందుకు సాగిపో
చెడు వైపు మనసు వెళ్తే ఆగిపో!.
ఓటమిని గెలుపుకు సోపానముచేసుకో
అవకాశం వచ్చినపుడు ఒడిసిపట్టుకో
ప్రతి ఉదయం పునర్జన్మ అని తెలుసుకో
ప్రతి క్షణం నిన్ను నీవు మలచుకో!.

**–కానుకొలను వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు**

### మాయలో మౌనం

ఆకురాలిన చోట చిగురు చెమర్చు పకృతిన
వెతకంగ పోయినచోటనే పోయింది పుట్టుకొచ్చు
మనల జేసిన కర్మ వెంటనే ఎదురొచ్చి పలుకు
గీత సారాన మేల్గట్టి చెప్పిరే పుట్టక గిట్టుక గుట్టు
మేనున్న ప్రాణం ఆరిపోగ ఆత్మనై మరొక్క జన్మని.
పునర్జన్మన గతాన కాయం చేసిన చేష్టాల లెక్క
కర్మన పూరింపగ కష్టసుఖాల తోరణ తోడగు
సుమం తావి తనలోని చివరి వరకు శోభించు
దైవాన మరో మలుపునందైన సహజమన
జీవిక ఊపిరి తీసి వీడేదాక పోరాటమిదేగదా.
యదార్థలనిలా గణించి విభజించి కొలతలు
తాకు తప్పుల విచారించి బ్రతుకీడుమనే పెద్ద
ఉందో లేదో తెలీని పునర్జన్మ ఫలం ఎవ్వానికి తెల్దు
మానవత్వం బ్రతక మాంచి సోపాన పీఠంబయ్యే
కీడున్జేయ కొంత భయాన్ని తలచి చరించే కీలకం
చేసిన ఫలమే పుర్జన్మగ జీవరాసుల్లోనొక పీచునౌ
దేవుడుంటే కర్మ సిద్ధాంతం నడిస్తే పునర్జన్మ నడు
ఈ ప్రస్థావన తరాల నుండి చర్చగ తోస్తున్నది
నమ్మికతో ప్రవర్తన భయాన మార్చగల్గితే సౌఖ్యం
లేదంటే గమ్యలేని గుర్తుగా జీవిక చరిత చలోమను.

**–గజ్జెల శ్రీనివాసులు**
9573364928

### కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ 95021 56813



### ఋణం

అమ్మా!నీవు లేని లోటు స్పష్టంగా తెలుస్తున్నది.
నీ ప్రేమ,త్యాగాల రక్షణ
ధృడమైనది.
నీ బాధ్యత,బంధాల విలువ
మరువలేనిది.
నీ ఓపిక,ధైర్యం నాకెప్పుడూ
ఆశ్చర్యం కల్గించేవి.
నీ దయ,ధర్మం అనిర్వచనీయమై నిలిచిపోయాయి.
నీవిచ్చిన అస్తిత్వం ఆస్తియై
కనబడుతుంటే,
నీవు పెంచిన విలువలు దివ్వెల్లా వెలుగుతున్నాయి.
నీ ఆరాటం,తాపత్రయం రెండుకళ్ళై నిత్యం చూస్తూనే ఉన్నాయి.
అమ్మా!దేవుడు వరమిస్తానంటే,
పునర్జన్మంటూ ఉంటే నీ కడుపులోనే ప్రాణం పోసుకుంటా!
నీ ఒడిలో నిద్రిస్తా.

**–డా.రామక కృష్ణమూర్తి**
బోయినపల్లి,సికింద్రాబాద్.

### పునర్జన్మ

మళ్లీ ఒక ఉదయం
జీవితం ఒక ముగింపు కాదు?
ఒక కొత్త ప్రయాణానికి
తలుపు తెరిచే నిశ్శబ్ద క్షణం?
నిన్నటి జన్మలో
మిగిలిపోయిన కలలను
ఈ జన్మలో వెతుక్కుంటూ,
అసంపూర్ణమైన కథలకు
కొత్త అర్థం చెప్పడమే
పునర్జన్మేమో?
మారిన రూపం కావచ్చు,
మారిన బంధాలు కావచ్చు,
మారిన కాలం కావచ్చు?
కానీ ఆత్మలో దాగిన
ఆ అనుబంధాల జ్ఞాపకాలు
ఎక్కడో ఒకచోట
మనసును తాకుతూనే ఉంటాయి.
ఒక జన్మలో కలవలేని మనసులు
మరో జన్మలో
ఎదురెదురుగా నిలబడవచ్చు?
ఒక జన్మలో
చెప్పలేని మాటలు
మరో జన్మలో
కళ్ల భాషగా మారవచ్చు?
పుట్టుక కొత్తదైనా
ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది?
మరణం ఒక విరామమైతే,
పునర్జన్మ
ప్రకృతి రాసే మరో కొత్త అధ్యాయం?
అందుకే?
ఈ జన్మలో ప్రేమించాల్సిన
వారిని ప్రేమిద్దాం,
చేయాల్సిన మంచిని చేద్దాం,
చెప్పాల్సిన మాటను చెప్పేద్దాం?
ఎందుకంటే
తరువాతి జన్మ ఉంటుందో లేదో
తెలియదు?
కానీ ఈ జన్మ మళ్లీ రాదు?!

**–రజని కులకర్ణి**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి.

కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1899వ రోజు 'హృదయం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు.

కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'హృదయం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. .

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & నిర్వహణ
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839



### గుప్పెడంత గుండె

గుప్పెడంత గుండెలో
పొదువుకున్న
భావ మధురిమలెన్నో
దాచుకున్న ఆనందాలెన్నో
పదిలపరిచిన అనుభవాలెన్నో
లోనికి నెట్టేసిన ఆవేదనలెన్నో!.
ఆవేదనతో తల్లడిల్లినవేళ
సాంత్వన పరుస్తూ
పన్నీరు చిలకరించే జ్ఞాపకాలెన్నో
అపురూపంగా తీసి
చూసుకునే స్మృతుల
తీపి తాయిలాలెన్నో
మళ్ళీ మళ్ళీ నెమరువేసుకొనే
మధురానుభూతులెన్నెన్నో!.
చేదు సంఘటనల గాయాలు..
అనుకోకుండా
ఎదురైన ఆపదలతో
చెదిరిన గుండె గూటికి
చేసిన మరమ్మత్తులెన్నో!.
మోదమైనా, ఖేదమైనా
స్వీకరించే హృదయాన్ని
పదిలంగా కాపాడుకునే
ప్రయత్నం తప్పనిసరిగా చేయాలి!.
ఒత్తిడి నివారణోపాయాలతో
దురలవాట్లకు దూరంగా…

-చంద్రకళ దీకొండ

### మాయల పంజరంల

గుప్పెడు పరిమాణం
నాలుగు ద్వారాలు,
లబడబల కవాటం
మూసి తెరవడం
నిరంతర సహకార జీవన ఆధారం
ప్రాణాన్ని వొళ్లంతా నింపుతావు
కష్టనష్టాలకు
సుఖదుఃఖాలకు
తోడుగా ఉంటావు
భావోద్రేకాలు
ప్రేమానురాగాలు
అనుభవ అనుభూతులు
కలిగించి కలిపించి
రసమయ జీవితాన్ని
ఒసగుతావు
హృదయమా!
మమ్ము బెదిరించకుమా!.
వికసించి
పరిమళ పువ్వులా అనిపిస్తావు
కమ్మని సుతిమెత్తని
మధురిమలను వినిపిస్తావు
కరుణ దయా సాగరాలతో
నడిపిస్తావు
నా దానివైన ఓ హృదయమా!
నీవు వేరుగా ఏల ఉంటావు?.
దాచి ఉంచితే చేటు కలిగిస్తావు
పొంగి పొరలితే మేలు చేయిస్తావు.
మనిషన్నాక హృదయముండా,
వృథలతో
బాధలతో వేధించకు,
అంతా మాయల పంజరం
అపురూపం నా హృదయం.

-రాజప్ప

### గదిలో నిలిచిన హృదయం

హృదయం చిన్న గది కాదు
వేల జ్ఞాపకాల నిలయం
మాటలకందని భావాలను
మౌనంగా మోసే మధుర కవిత.
నవ్వు వెనుక కన్నీటిని
కన్నీటి వెనుక ఆశను
దాచుకుంటుంది
ఓదార్పు కోసం
ఎదురు చూడకుండా
ఇతరుల బాధకు
తలుపు తెరుస్తుంది.
ప్రేమను పంచితే
పెరుగుతుంది,
అభిమానాన్ని ఇస్తే
వెలుగుతుంది
క్షమించడం నేర్చుకున్న క్షణమే
హృదయం
దేవాలయమవుతుంది.
ఎంత గాయమైనా నిశ్శబ్దమే
ఎంత బాధైనా చిరునవ్వే
మనిషిని మనిషిగా నిలబెట్టేది
చివరికి మనసున్న హృదయమే!.

-వి.సంధ్యారాణి

### గుండె గూటిలో!

గుండె గూటిలో ఒదిగిన
భావాలెన్నో!
పొదిగిన అనుభూతుల స్మృతులెన్నో!
ఆవేదనకు లోనయిన బాధలెన్నో!
ఊహలకు రెక్కలు తొడిగిన
ఆశలెన్నెన్నో!.
కలలకు చిగురులు
తొడిగిన కోర్కెలెన్నో!
అపురూపమైన ఆలోచనలకు
సృజనాత్మకత నేర్పిన
జ్ఞాన విజ్ఞానాన్ని మేల్కొలిపే
అనుభవ భావాలెన్నో!
మనసును మురిపించే
మెరుపులతో సందడి చేస్తూ,
నిను మనిషిగా
తీర్చిదిద్దే బాధ్యతలెన్నో
కష్టాల కడలిలో
ఎదురీదాలనే సంకల్పంతో
ధైర్యం స్థైర్యం నింపుకున్న
విలక్షణ విన్యాసం
గుండె గూటిలో
దాచుకున్న స్ఫూర్తితో.
పుట్టినదాదిగా
గుప్పెడంత గుండె
లబ్ డబ్ లబ్ డబ్
శ్వాసక్రియలో
అలుపెరుగని
అవిశ్రాంత పోరాటం
అనంతమైన
ఆత్మా పరమాత్మల కలయికలో
తాత్త్విక ఆధ్యాత్మిక
జీవన ప్రయాణం
మానవతా దృక్పథంతో..!.

-పి.పద్మావతి

### బుడగ

క్యార్ క్యార్ రోదనతో
లబ్ డబ్ మొదలై
ఆగని గుండె చప్పుడు
డప్పులమోతతో
కాయంతో మాయం
జీవితమంతా నవ్వుల ఏడ్పులతో
గడిపిన బుడగ
అవిశ్రాంతంగా
రక్కున అలసి
చిల్లులు పడిన
తిత్తితో వేలాడుతుంది.
ప్రేమాప్యాయతలు
ప్రకృతి ఒడిలో పెరిగిన గుండె
సంతృప్తి,సంతోషం కరువై
క్షణక్షణం బతుకు భయం
భౌతిక సౌకర్యాల బోనులో
మానసిక శాంతి కరువై
ఒత్తిడితో రేపటిభయంతో
మాటల తూటాల గాట్లతో హఠాత్తుగా
ఠాప్ అంటూ పగులుతుంది
సహృదయత లేని చిల్లి కడవ
నేటి బతుకు.

-ఎ.రాజ్యశ్రీ

### ప్రథమ కర్తవ్యం

మాధుర్య గుణం
విధి నిర్వహణ
ప్రథమ కర్తవ్యం
మానవ హృదయానికి

-డా.సి.వసుంధర

### బాలగేయం..

అమ్మో దూరం
వెళ్ళుట కష్టం కదరా..,
చదువుల బస్సు లో ముందుకు వెళితే సులభమే అది పదరా..!
ఢిల్లీ నగరం ఎంతో దూరం
వెళ్ళుట కష్టం కదరా..,
చదువుల రైలును ఎక్కి వెళ్ళితే సులభమే అది పదరా...!
అమెరికా దేశం అబ్బో దూరం పోవుట కష్టం కదరా..,
చదువుల విమానమెక్కిపోతే వెళ్ళుట సులభమే పదరా..!
అన్నింటికి చదువులె అంటావు
చదువుట కష్టమే కదరా..,
ఇష్టంతో నువ్వు సాధన చేస్తే
చదువే సులువు పదరా..!!..

- డా.కాసర్ల నరేశ్ రావు
9441406252



# అందరూ చదవాల్సిన కథలు



-డా॥ప్రభాకర్ జైనీ
సెల్:7989825420

ఒక జిల్లా గురించి కథ రాయాలంటే, ఆ జిల్లా నేల మీద కాలు మోపాలి. అక్కడ కనీసం, ఒక్క రాత్రైనా నిద్రించాలి. ఆ నేల గాలిని పీల్చాలి. ఆ నేల గుండెలో నిక్షిప్తమైన గాథలను, వ్యథలను మనసు పెట్టి ఆలకించాలి. అక్కడి మనుషులను పరిశీలించాలి.

ఆ ఒక్క రోజుకు ఆ నేల బిడ్డనై పోవాలి. అప్పుడే, ఆ కథలో జీవం తొణికిసలాడుతుంది. ఆ వాగ్దేవి కరుణిస్తే, ఆ నేల తల్లి మనకో కథను ప్రసాదిస్తుంది. నేనైతే, నేనొక రాత పరికరాన్నే అనుకుంటాను. ఆ నేల తల్లి నాకు చెప్తుంది. దాన్ని నేను కథగా రూపొందిస్తాను. అందుకే ఆ కథ నేను రాస్తున్నప్పుడే నా గుండె కింది కండ కదిలి, నన్ను కన్నీళ్ళ పర్యంతం చేస్తుంది. నా కథకు అదే ఒక గీటురాయి. ఒక లిట్మస్ టెస్ట్. నా కళ్ళు చెమరిస్తేనే, నా కథకు నేను పాస్ మార్కులు వేస్తాను.

నేను ఈ కథా సంపుటుల కోసం గత ఎనిమిది నెలలుగా, దఫదఫాలుగా, అన్ని జిల్లాలు తిరిగాను. కొన్ని పూర్వ జిల్లాలుగా ఉన్నప్పుడు ఉద్యోగరీత్యా అక్కడ పనిచేసాను. అయినా, మళ్ళీ ప్రతీ ఒక్క జిల్లా, యాభై తొమ్మిది జిల్లాలను సందర్శించాను. ఎందుకంటే, ఇప్పుడు నేను ఆ జిల్లా ఆత్మను స్పృశించి, ఆ నేల గాథను రికార్డు చేయవలసి ఉంది.

ఈ కథలు రాయడంలో, ఒక పద్ధతిని అవలంబించాను. అది ఒక జిల్లా చారిత్రక, శిల్పకళా, సాహిత్య వైభవాన్ని తెలియచేస్తూ, ప్రస్తుతం ఆ జిల్లా ఎదుర్కుంటున్న ఒక ప్రధాన సమస్యకు పరిష్కారం వెతకడం ఈ కథలలోని ముఖ్య ఉద్దేశ్యం. ఆ పనిని నిర్వర్తించడానికి, ఒక నాయకుడినో, నాయకినో ఎన్నుకున్నాను. వాళ్ళు అదే ఊళ్ళో ఉంటే, ప్రపంచపు వేగాన్ని అర్థం చేసుకోలేరు. ప్రపంచంలో







శరవేగంగా మారుతున్న ఫ్యాషన్, బిజినెస్, అభిరుచులు, ప్రాచీన కళల, చరిత్ర, సాహిత్యం పట్ల మారుతున్న దృష్టిని అర్థం చేసుకోలేరు. ప్రపంచ పర్యాటకుల సౌందర్య దృష్టి, వారి ఫోకస్ కూడా మారుతుంది. వారు హైదరాబాదుకు వచ్చి హైటెక్ సిటీ, మెట్రో రైలు అసెంబ్లీ భవనాలను చూడాలనుకోవడం లేదు. విజయవాడకు వచ్చి ఆధునిక భవనాలను, కృష్ణా నదిని మాత్రమే చూడాలనుకోవడం లేదు. వైజాగుకు వచ్చి రామకృష్ణా బీచ్ తో సంతృప్తి చెందడం లేదు. అవి ప్రపంచంలోని ప్రతీ నగరంలో ఉండేవే.

కానీ, వారు హైదరాబాదుకు వచ్చేది హైదరాబాదు ఆత్మను సందర్శించడం కోసం. చార్మినార్ పక్కనే ఉన్న లాడ్ బజార్ లో అమ్మే మట్టిగాజుల గలగలల కోసం, గోల్కొండ కోటలో, కోట అడుగున చప్పట్లు కొడితే, కోట పై భాగాన వినిపించే చప్పట్ల ఆనందాన్ని అనుభవించడానికి వస్తున్నారు. అటువంటి పర్యాటకులకు తెలంగాణాలోని నిర్మల్ బొమ్మల గురించి, వరంగల్ రామప్ప గుడిలో 850 సంవత్సరాల క్రితమే చెక్కిన నాగినీ, రాగిణీ విగ్రహాల గురించి, కరీంనగర్ ఫిలిగ్రీ కళ గురించి, వికారాబాద్ అడవుల అందాల గురించి; కూచిపూడి నాట్యం గురించి, బొర్రా గుహల గురించి, అమరావతిలో పరిఢవిల్లిన నాగార్జుని చైతన్యం గురించి, శ్రోతలను భక్తి పారవశ్యంలో ముంచిన అన్నమయ్య కీర్తనల గురించి, రాజమహేంద్రవరంలో నన్నయ నడయాడి ఆంధ్రీకరణ చేసిన మహాభారత సాహిత్య సౌరభాల గురించి, మగువ మాంచాల తెగువ గురించి చెప్పి, చూపించి, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పర్యాటక వైభవాన్ని ప్రపంచ పర్యాటక రంగం మీద నిలిపాలనే తీవ్రమైన కాంక్షతో నిబద్ధతతో పనిచేస్తున్న హీరో హీరోయిన్ల గురించే ఈ కథల్లో ఉంది.

మరుగున పడుతున్న ప్రాచీన శిల్ప కళలు, హస్త కళలు, సాహిత్యం మూలంగా వాటినే నమ్ముకున్న ఆయా కళాకారులు దీనావస్థలో ఉన్నారు. వారినీ, ఆయా హస్తకళలకు పునరుజ్జీవనంతో పాటు వారికి ఆధునిక ప్రపంచపు వ్యాపార మెళుకువలు నేర్పి, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచ సాంస్కృతిక వేదికల మీదకు చేర్చడమనే మహా సంకల్పంతో పనిచేస్తున్న యువతీయువకుల కథలే ఇవి. ఒక్కోసారి రొటీన్ గా అనిపించవచ్చు. కానీ, ప్రతీ కథలో గుండె కింది కండ కదిలే ఒక మానవత్వపు కోణాన్ని చూపించాను. రాసేటప్పుడే నా కళ్ళు చెమర్చాయి. మీలో ఎవరికైనా అటువంటి స్పందన కలిగితే అది నా ప్రయత్నానికి ఆశీర్వచనంగా భావిస్తాను.

అయితే, జిల్లాలకు సంబంధించిన కథలు అనగానే, ముందుగా మనకొక అభిప్రాయం ఏర్పడుతుంది. ఆ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలన్నీ, చారిత్రక విశేషాలన్నీ, సాహితీ విషయాలన్నీ ఉంటాయోమోనని అనుకుంటారు. అటువంటి కథలు ఇంతకు ముందు వచ్చాయి కూడా. కానీ, నేను అందుకు భిన్నమైన పద్ధతిని అవలంబించాను. ఎందుకంటే, కథ యొక్క విస్తృతి తక్కువ. నవల అంత స్వేచ్ఛ ఇక్కడ రచయితకు లభించదు.

నాకు కథ ముఖ్యం. కథలో భావం, భాష, క్లిష్టత, సమస్య ఉండాలి. కథకు ఒక సాహిత్య, సామాజిక ప్రయోజనం ఉండాలి. కథ ఒక అధికారిక దస్తావేజు, అఫీషియల్ డాక్యుమెంట్ కాదు. కథ హృదయాలను కదిలించాలి. సమస్యను ఎత్తి చూపి, దానికి పరిష్కారం చూపే క్రమంలో మనలో నిద్రాణమై ఉన్న ఆర్ద్రతను కదిలించాలి.

అందుకే నేనొక జిల్లా గురించి రాయాలని అనుకోగానే, ఏవి ఎంత మోతాదులో ఉండాలని నిర్ణయించుకుంటాను. ఉదాహరణకు, నా పుట్టిన ఊరు వరంగల్ గురించి రాయాలనుకుని నేను వరంగల్ కోట, వేయి స్థంభాల గుడి, రామప్ప గురించే రాస్తే అది కథ కాదు, ఒక వ్యాసం అవుతుంది. నా కథలో ముఖ్యంగా మనసును మెలిపెట్టే సంఘర్షణ ఉండాలి. ఆ సంఘర్షణకు అవసరమైన సంఘటన, పరిస్థితి మా జిల్లాలో ఏముందో వెతికాను. ఈ ఆధునిక సామాజిక, రాజకీయ వ్యవస్థలో అనేక సమస్యలుంటాయి. కానీ, నాకు కావలసిన సమస్యను, నా ప్రధాన పాత్ర అనుభవించి దానికి పరిష్కారం కనుగొనే విధంగా ఉండాలి. ఆ సమస్యనే నేను ఎన్నుకున్నాను. వరంగల్ జిల్లాలో అనేక సమస్యలున్నాయి. నిరుద్యోగం, పేదరికం, మాదక ద్రవ్యాలు, హస్తకళల నిర్లక్ష్యం వంటివి చాలా ఉన్నాయి. ఈ సమస్యలన్నీ అన్ని జిల్లాలకు, అన్ని ప్రాంతాలకు కామనే కదా? వీటిలో ఒక సమస్యను తీసుకుని వరంగల్ కథను రాస్తే, నేను తరువాతి జిల్లాకు ఏ సమస్యను తీసుకుని కథ రాయగలను? అందుకే, వరంగల్ జిల్లాకు ప్రత్యేకమైన సమస్య కోసం పరిశోధించాను. నాకొక సమస్య దొరికింది. దాన్ని డెవలప్ చేయడానికి ఒక పాత్ర, ఒక సంఘర్షణ, ఒక పరిష్కారం ఎంచుకున్నాను.

వరంగల్ కథకు సంబంధించిన శిల్పం, చరిత్ర, భౌగోళిక స్వరూపం అన్నీ ఆ కథలో ఉంటాయి. కానీ, నేపథ్యంలో ఉండి కథకు ఒక సాధికారతను ఇస్తాయి తప్ప అవే ప్రధాన భూమికను పోషించవు. ఒకవేళ సమస్యే శిల్పానికో, నీటి సరఫరాకో, హస్తకళకో సంబంధించినది అయితే దానినే ప్రధానంగా చర్చించాను.

కథలో భాష, భావం నాకు ముఖ్యం. అయితే, మొత్తం రెండు రాష్ట్రాలలోని పాఠకులకు చదవడానికి అనువుగా ఉండాలనే ఉద్దేశ్యంతో వ్యావహారిక భాషలోనే కథలు రాసాను.

పాఠకుడి హృదయస్పందన ముఖ్యం. ఒక కథను ఈ సంపుటి నుండి తీసి విడిగా తీసి చూసి చదివినా ఒక మంచి కథ, ప్రభాకర్ జైనీ రాసిన కథ అని పాఠకుడు ఫీల్ కావాలన్నదే నా తాపత్రయం.

ఈ కథలు రాయడం కేవలం నా సంకల్ప బలం వల్లనే సాధ్యపడడం లేదు. భగవంతుని ఆశీర్వాదం ఉంటేనే సాధ్యమయింది. తెలంగాణలోని ప్రతీ గుండెను తట్టే విధంగా రాయగలిగినందుకు, ఇవి నా నలభై తొమ్మిది, యాభయ్యవ పుస్తకాలుగా వస్తున్నందుకు కూడా నాకు చాలా సంతోషంగా ఉంది. ఎటువంటి సాహిత్య నేపథ్యం లేని కుటుంబం నుండి వచ్చిన నేను ఇన్ని పుస్తకాలు రాయడం, అవి అపూర్వ ఆదరణ పొందడం కేవలం వాగ్దేవి కృప వల్లనే సాధ్యమయింది.

ఈ రెండు పుస్తకాలు రాయల్ సైజులో, బౌండెడ్ అట్టలతో, ఆకర్షణీయంగా, ఈ పుస్తకం మీ చేతిలో ఉంటే హుందాగా ఒక హస్తభూషణంగా ఉండేలా రూపొందించాము. (రాయల్ సైజు ఎలా ఉంటుందో తెలియడానికి క్రింద డిస్ ప్లే లో మామూలు సైజు 'హీరో' పుస్తకం, రాయల్ సైజులో ఉండే 'ఃనీటఎ నీట ఒతివబ' పుస్తకాన్ని చూపించాను) మా బాబు చిరంజీవి ఆకాశ్ జైనీ, నా శ్రీమతి విజయలక్ష్మి జైనీ సహకారం ఈ పుస్తకంలోని ప్రతీ అక్షరంలో ఉంది. అత్యంత శ్రమ, విషయ సేకరణ, ప్రయాణాలు ఇవన్నీ మా బాబు చూసుకున్నాడు.

ఈ మహత్తర ప్రయత్నానికి మీ అందరి ఆశీస్సులు కోరుతూ, మీ ప్రభాకర్ జైనీ.

***(రెండు పుస్తకాల వెల 850 రూపాయలు (450+400). పోస్టేజి తో కలిపి సుమారు వెయ్యి రూపాయలు అవుతుంది. (రెండు పుస్తకాల బరువు ఒక కిలో పైనే ఉంటుంది.)ప్రీ లాంఛ్ ఆఫర్ గా 25% డిస్కౌంట్ ఇస్తున్నారు. 750 రూపాయలు 9849369049, నెంబరు పైన జీ పే, ఫోన్ పే ద్వారా గానీ, పెంటేకర్ శ్రీనివాసరావు గారికి చెల్లిస్తే, ఆవిష్కరణ తర్వాత, ఈ నెలలోనే స్పీడ్ పోస్టులో పంపిస్తారు.)***

### ఆమె ఒక శ్రమశక్తి

ఆమె ఒక శ్రమశక్తి నే
తెల్లవారకముందే లేచి ఇంటిని దేవాలయం చేస్తుంది,
నిస్వార్థ మణిదీపం ఆమె,
తన సుఖాన్ని త్యాగం చేసి పరులకు వెలుగునిస్తుంది
కొవ్వొత్తిలా కరుగుతూ..
పదుగురికి ఆదర్శం ఆమె జీవనం,
కష్టాల కొండను ఓర్పుతో అధిరోహిస్తుంది,
విమల కళా నిస్వార్థం ఆమె హృదయం,
అత్తగా, అమ్మగా, అక్కగా, చెల్లిగా అన్ని పాత్రలు పోషిస్తుంది…
అపురూపం మహిళా జీవితం,
ఆమె కంటి చూపులోనే వేయి ఓదార్పులు,
ఆమె చేతి స్పర్శలోనే అమృతపు వైద్యం,
ఆమె లేని ఇల్లు దీపం లేని చీకటి గూడు…
స్త్రీని గౌరవిద్దాం, ఆమె శ్రమను గుర్తిద్దాం,
ఆమెలేని ఇల్లు అడవితో సమానం
ఆమె త్యాగానికి తలవంచి నమస్కరిద్దాం…

-బిరుదు రాజు ప్రమీల రాణి
964011956

### కవుల స్వేచ్ఛను హరించకండి.

కవి మనసు ఊహాజనితం.
కవి కలం విహరించే విహంగం.
అక్షరం ఒక అగ్ని కణం.
సమాజానికి సంధించే ప్రశ్నల శరం.
దాన్ని బంధించకండి ఉక్కుపంజరం.
కవిది సమాజాన్ని మేల్కొలిపే తత్వం.
కవి కలం ప్రజలను చైతన్యపరచే అంకుశం
కాసులకు లొంగని,బెదిరింపులకు
భయపడని నిబ్బరత్వం.
అన్యాయాలను,అక్రమాలను వెలుగు చూపే రవితేజం.
న్యాయంకోసం కలాన్ని కత్తిలా చేసే కవికలం.
ప్రశ్నించే కలాన్ని కాలరాయకండి.
కలం కన్నీటి ప్రవాహంలో కొట్టుకుపోకండి.
సత్యాన్ని పలికే కవిత్వానికి పట్టం కట్టండి.
భావాల రెక్కలను విరవకండి.
అనుభవాల కవిత్వాన్ని కనుమరుగు కానీయకండి.
నిజాయితీ గల అక్షరానికి నీరాజనం పలకండి.
కవుల స్వేచ్ఛను హరించకండి.
స్వచ్ఛమైన స్వేచ్ఛాక్షరాన్ని అవనిపై శాశ్వతం చేయండి.
గిరిగీసి హద్దులు పెట్టి అక్షరాన్ని బంధించకండి.
కలాన్ని బ్రతకనివ్వండి,అక్షరానికి స్వేచ్ఛనివ్వండి.
కవి ఆలోచనలకు అడ్డుకట్ట వేయకండి.
బంధు ప్రీతికి తలవొగ్గకండి.
స్వేచ్ఛావిహంగమై కవిత్వాన్ని విహరింప నీయండి.
+91 97038 58539

### భావ రాగ తరంగిణి

సౌందర్యం మరియు కళ
పండించే భావాలు లిఖించడం కవిత్వంలో
సౌందర్యాన్ని సహజంగా
అలవోకగా వ్రాయ గలిగే



### కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### దారి

కవితకు స్వేచ్ఛే నిజమైన ఊపిరి
కవి భావాలకు అదే మంచి దారి
కలం కదిలితే పుడుతుంది సిరి
అక్షరాల్లో కనిపించాలి కవి స్ఫూర్తి.
స్వేచ్ఛ ఉంటే సృజన సాగుతుంది
భావం ఉంటే కవిత పుడుతుంది
కలం కదిలితే కొత్త ఆలోచన వస్తుంది
మాట పలికితే మనసు పులకరిస్తుంది.
స్వేచ్ఛ పేరుతో స్వార్థం వద్దు
సొంత లాభం కోసం రాయొద్దు
ఇతరుల మనసులను గాయపరచొద్దు
కలం విలువను ఎప్పుడూ తగ్గించొద్దు.
హక్కుతో పాటు బాధ్యతను మోయాలి
కలం మంచి మార్గం చూపాలి ఎప్పుడూ
కవిత మనసులను కలపాలి ఎప్పుడూ
కవుల స్వేచ్ఛను కాపాడాలి అందరూ
కలం ఎప్పుడూ మేలు కోరాలి
కవుల స్వేచ్ఛ నిలవాలి ఎప్పటికీ.

-నిమ్మగడ్డ కృష్ణ
81057 12574

నేర్పరితనం నైపుణ్యమే
కవి లక్షణం…!.
భావ ప్రకటనలో స్వచ్ఛత
స్వేచ్ఛ వర్ణన అందం ఒక
మాయ జలం…
విషాదం సంతోషం ఏదైనా
కవి మనస్సులో జనించే
భావాలకు అక్షర రూప కల్పనలో కలం
ఆగి పోరాదు…
పరిణితి చెందిన కవితకు
సృజనాత్మకత భావ సౌందర్యం…
భావ సౌందర్యం ఆస్వాదించాల్సిందే…
చెట్టు ఆకుపచ్చగా
మోడు వారినా మళ్ళీ
చిగురిస్తుంది… సహజంగా
కవిత్వం వ్రాయ లేనప్పుడు
కవుల స్వేచ్ఛను హరించకండి….
ప్రతి కవితా కుసుమం
అందరిని… మెప్పించాల లేదు…

- విజయ సుధీర్.
సెల్:97046 56177

# పండితుని సమస్య

(కథ)



శాలినీ రాజ్యాన్ని కీర్తిసేనుడు అనే రాజు పరిపాలించేవాడు. అతడు తెలుగు భాషాభిమాని. అతని ఆస్థానంలో గురుపాదుడు అనే గొప్ప పండితుడు ఉండేవాడు. రాజుకు అతడు గొప్ప పండితుడని తెలియదు.

ఒకరోజు ఆ ఆస్థానానికి ఒక పొరుగురాజ్య పండితుడు వచ్చి "మహారాజా! నేను ఒక ప్రశ్నను అడుగుతాను. దానికి జవాబు చెప్పిన వారిని నేనే సత్కరిస్తాను. అంతేకాదు. ఆ ఆ పండితుని గొప్ప తనం గురించి కూడా నేను మా రాజ్యంలో ప్రచారం చేస్తాను "అని అన్నాడు. అందుకు కీర్తిసేనుడు తన పండితులపై ఉన్న నమ్మకంతో అంగీకరించాడు.

అప్పుడు పండితుడు లేచి " మహారాజా! మీరు తెలుగు భాషాభిమాని అని నాకు తెలిసింది. తెలుగు భాషలోని వాడుకలో మూడు అక్షరాల తెలుగు పదం ఒకటి ఉంది. అది ఎటు చదివినా ఒకే లాగా ఉంటుంది. ఆ పదం ఏమిటి ? అందుకు కొన్ని ఆధారాలను ఇస్తాను. అది స్వర్గంలో కూడా ఉంటుంది. ఇతర రాజ్యాలలో కూడా నేను చాలా చోట్ల దాన్ని చూశాను. కానీ మీ రాజ్యంలో మాత్రం అది కనబడలేదు. అది ఏమిటి? " అని ప్రశ్నించాడు. పండితులందరూ ఆ పదం చెప్పలేక తలలు పట్టుకొన్నారు.

అప్పుడు రుద్ర భట్టు అనే పండితుడు లేచి "మహారాజా! మరి ఏదైనా ఆధారం ఇవ్వమనండి. ప్రయత్నిస్తాం"అని అన్నాడు. అప్పుడు ఆ పండితుడు ఒకే ఒక్క ఆధారం ఇస్తానని తెలిపి "దాని మొదటి రెండు అక్షరాలు ఒక వంశం పేరు "అని అన్నాడు. అప్పుడు కూడా ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

అప్పుడు గురుపాదుడు లేచి "ఓ పండితవరేణ్యా! అది "నందనం. అది మీరు అడిగినట్లు ఎటు నుంచి చదివినా ఒకే లాగా ఉంటుంది. దాని మొదటి రెండు అక్షరాలు" నంద" అని నందవంశం పేరు కదా! ఆ నందనం అంటే ఉద్యానవనం అని అర్థం. అలాగే ఇంద్రుని ఉద్యానవనం పేరు కూడా! అది స్వర్గంలో కూడా ఉంది. మన రాజ్యంలో తప్ప మిగతా అన్ని రాజ్యాల్లో చాలా ఉద్యానవనాలు ఉన్నాయి. కానీ మన రాజ్యంలో మాత్రం అవి లేవు. మనకు చెట్లు పెంచాల్సిన అవసరం చాలా ఉంది. అదే విషయాన్ని ఈ పండితుడు మన దృష్టికి తెచ్చాడు "అని అన్నాడు. అది విన్న ఆ పండితుడు జవాబు సరైనదేనని ఒప్పుకున్నాడు.అప్పుడు మహారాజు" ఓ పండితవరేణ్యా! ఈరోజు మా రాజ్య పరువు నిలిపారు. ఇంత గొప్ప పండితులు మా సభలో ఉండడం మా అదృష్టం" అని గురుపాదుని ఘనంగా సత్కరించాడు. ఆ పొరుగు రాజ్య పండితుడు కూడా తాను అన్నమాట ప్రకారం గురుపాదుని ఘనంగా సత్కరించాడు. పర్యావరణ సమస్యను తన దృష్టికి తీసుకొని వచ్చినందుకు ఆ పొరుగురాజ్య పండితుని కూడా రాజు ఘనంగా సత్కరించాడు. తర్వాత రాజు మన రాజ్యంలో మొక్కలు నాటించి ఉద్యానవనాలను పెంచుతానని అన్నాడు. పర్యావరణ కాలుష్యం లేకుండా ప్రజలు కూడా కృషి చేయాలని, అందుకు వారు మొక్కలను నాటి పెంచాలని, ఇది తన ఆదేశమంటూ చాటింపు వేయమని తన మంత్రిని ఆదేశించాడు. ఇలాంటి సమస్యలు పండితులు తమ దృష్టికి తేవాలని రాజు అన్నాడు. అందుకు పండితులు సరేనన్నారు.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535



# తెలుగు కథా జగత్తులో బడుగు జీవుల చైతన్య దీప్తి సదానంద శారద



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
బీసీ కమిషన్ తొలి ఛైర్మన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

తెలుగు కథా సాహిత్యంలో తనదైన ముద్ర వేసి, తెలంగాణ పల్లెటూళ్ల మట్టి వాసనలను, బడుగు, బలహీన వర్గాల అంతరంగాన్ని అత్యంత సజీవంగా అక్షరీకరించిన విశిష్ట రచయిత పాకాల సదానంద శారద. సమాజంలోని రుగ్మతలను, పేదరికాన్ని, అణగారిన వర్గాల వేదనలను తన కలంతో దృశ్యమానం చేసిన ఆయన సాహిత్య ప్రస్థానం తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇటీవల దీర్ఘకాలిక అనారోగ్యంతో కన్నుమూసిన సదానంద శారద గారి సాహిత్య కృషి అపూర్వమైనది. కథలు, నవలలు రాయడంతో పాటు కథా సదస్సుల నిర్వహణ, నూరేళ్లకు పైగా తెలుగు కథల,తెలంగాణ కథల సంకలనకర్తగా, సంపాదకులలో ఒకరుగా ఎంపిక చేయడం వంటి చరిత్రాత్మక కర్తవ్యం నిర్వర్తించారు.

## జాడీ , గొలుసు, పాల కంకి కథా సంపుటాలు

సదానంద శారద గారిని 1977 రాసిన "జాడీ' కథకుడిగా సాహిత్య లోకం గుర్తు పెట్టుకుంది. తొక్కుడు బండ, ఉప్పునీళ్లు, చిన్న గొలుసు, పాలకంకి మొదలైన కథలు బాగా ఆకట్టుకున్నాయి? కథను వేగంగా నడపడంలో, వ్యంగ్యం, చురకులు వేసే హాస్యం పండించే కథలు కూడా రాసారు. తెలుగు కథా సాహిత్యంలో సామాజిక స్పృహతో అద్భుతమైన పాత్రలను సృష్టించి, బడుగుగు జీవులను సాహిత్యంలోకి తెచ్చి సమాజ పరిణామాలను అక్షరబద్ధం చేసిన ప్రముఖ కథకుడు, నవలా రచయిత డా. సదానంద శారద గారు (పాకాల సదానందం) 77వ ఏట సెప్టెంబర్ 24న మరణించారు. వారి మృతి సాహిత్య రంగానికే కాకుండా, తెలంగాణ సామాజిక ఉద్యమ చైతన్యానికి తీరని లోటు. బీసీ సామాజిక వర్గమైన గంగపుత్ర కులంలో జన్మించిన ఆయన, నిరుపేద కుటుంబం నుండి స్వయంకృషితో ఎదిగి అణగారిన వర్గాల వ్యథలను క్షేత్రస్థాయి నుండి ప్రతిబింబించారు.

## చదువు ఉద్యోగం పెళ్లి

15 అక్టోబర్ 1950న వరంగల్ ఖిలాలో జన్మించిన సదానందం గారి విద్యా, ఉద్యోగ ప్రస్థానం స్ఫూర్తిదాయకమైనది. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బి.కాం (1968–70), ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.కాం (1974) పూర్తి చేసి, నాగ్‌పూర్ డా. అంబేద్కర్ కాలేజీ నుండి ఎం.ఫిల్, నాగ్‌పూర్ యూనివర్సిటీ నుండి పిహెచ్.డి (1998) పట్టాలను సాధించారు.

1975 మార్చిలో హైదరాబాద్ సిగ్నోడియా కాలేజీలో కామర్స్ జూనియర్ లెక్చరర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎన్.ఎన్.ఎన్ ఆఫీసర్‌గా సేవలందించారు. అనంతరం అగర్వాల్ కాలేజీ, ఎల్.ఎన్. గుప్తా కాలేజీలలో లెక్చరర్‌గా, రీడర్‌గా పదోన్నతులు పొందుతూ 2003లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. సుదీర్ఘ సేవకనంతరం 2008లో తన 58వ ఏట పదవీ విరమణ పొందారు.

ఆయన వ్యక్తిగత జీవితం ఆదర్శవంతమైనది. 8 ఆగస్టు 1975న వివాహమయ్యాక, భార్య శారద




గారిపై గౌరవంతో తన కలం పేరును 'సదానంద శారద'గా మార్చుకున్నారు. వారికి ముగ్గురు మగపిల్లలు. ఇద్దరు అమెరికాలో స్థిరపడగా, ఒకరు హైదరాబాద్ ఉప్పల్‌లో డెంటిస్ట్‌గా ఉన్నారు. సదానంద గారితో 1990 నుండి సామాజిక విషయాలపై నాకు లోతైన చర్చలు సాగాయి.

కథా సదస్సుల నిర్వహణ

1993 లో హైదరాబాద్ చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కథా సదస్సు చరిత్రాత్మకమైనది. అరసం నిర్మాతలైన సుప్రసిద్ధ రచయితలైన చాసో, కథా నిలయం , యజ్ఞం కథలతో సుప్రసిద్ధులైన, కాళీపట్నం రామారావు, అక్షర వాచస్పతి, వేదాలు ఉపనిషత్తులు రామాయణ, మహాభారతాలను తెలుగులో అందించిన ప్రఖ్యాత రచయిత అక్షర వాస్పతి దాశరథి రంగాచార్య , ఆంధ్ర ప్రదేశ్ దళిత రచయితల కళాకాకారుల మేధావుల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులైన సామాజిక తత్వవేత్త బి ఎస్ రాములు తదితర దిగ్దంతులను ఒక్కచోట కలిపిన గొప్ప సాహసి నిర్వాకుడు సదానంద్ శారద. 1997లో వెలువడిన బి ఎస్ రాములు గారి కథల పుస్తకం 'స్మృతి' సంపుటికి డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి, కాలువ మల్లయ్య గారలతో దీటుగా చక్కని ముందుమాట రాసి పూర్తి మద్దతు అందించారు. దళిత బహుజన రచయితల వేదిక తొలి మహాసభల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. సమాజంలో సమస్త అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు, గౌరవం దక్కాలనే మానవీయ దృక్పథం సదానంద శారద గారిది.

## కథల విశిష్టత

ఆయన సాహిత్య కృషి విస్తృతమైనది. 'జాడీ', 'గొలుసు', 'పాలకంకి', 'సదానంద శారద కథలు' అనే నాలుగు సంపుటాల ద్వారా రైతు కూలీలు, మధ్యతరగతి జీవితాలు, అంటరానితనంపై కలం ఎక్కుపెట్టారు. కాలేజీల్లో సాగే ఆధునిక వివక్షను 'ఉప్పునీళ్లు' కథలో, అంటరానితనాన్ని ఆంధ్రప్రభ వీక్లీలో మొదటి బహుమతి పొందిన 'మంచినీళ్ల బావి' నవలలో సజీవంగా చిత్రించారు. తన కథల సందేశం కోట్లాది మందికి చేరాలనే ఆశయంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి 'నేనే సరోజ' అనే సినిమాను నిర్మించారు. వ్యాపార ప్రపంచంలో అది నిలదొక్కుకోలేకపోయినా ఆయన ప్రయత్నం గొప్పది. అలాగే ఎంతో సేవ చేయాలనే లక్ష్యంతో పో కొన్ని విద్యాసంస్థల స్థాపించినా పోటీ ప్రపంచంలో కొంత



సదానంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం.

కాలానికే మూత పడ్డాయి. .

## నూరేళ్ల తెలుగు కథలు, తెలంగాణ కథల సంకలన కర్తగా..

సదానంద శారద గొప్ప రచయితగానే కాకుండా, విశాలాంధ్ర వారు ప్రచురించిన '(నూరేళ్ల) తెలుగు కథ', ('నూరేళ్ల ) తెలంగాణ కథ' వంటి అనేక చారిత్రక సంకలనాలకు కేతు విశ్వనాథరెడ్డి, పెనుగొండ లక్ష్మి నారాయణ, సింగమనేని నారాయణ, ఆర్టిస్టు చంద్ర, కాలువ మల్లయ్య వంటి ప్రముఖులతో కలిసి సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. వేలాది కథల నుండి అన్ని ప్రాంతాలకు, కాలాలకు ప్రాతినిధ్యం వహించేలా ఉత్తమ కథలను ఎంపిక చేయడంలో ఆయన అనుభవం పండి పరిణితి సాధించారు. ఆయన కథలు ముప్పయికి పైగా ప్రసిద్ధ సంకలనాల్లో చోటు సంపాదించుకున్నాయి. వివిధ ప్రజా ఉద్యమాల నేపథ్యంలో సాగిన ఆయన సాహిత్య ప్రస్థానం, తెలుగు కథా జగత్తులో బడుగు బలహీన వర్గాల గొంతుకగా ఎప్పటికీ సజీవంగా నిలిచిపోవడమే కాకుండా, రాబోయే తరాల పాఠ్యాంశం.

## స్వాతంత్రంతో పాటు ఎదిగిన 1947-1952 తరం ప్రత్యేకత విశిష్టత

స్వాతంత్రంతో పాటు ఎదిగిన తరం చరిత్రలో అనేక కర్తవ్యాలు నిర్వహించింది. తెలంగాణ సాహిత్య చరిత్రలో 1947 నుండి 1952 మధ్య కాలానికి ఒక ప్రత్యేకమైన చారిత్రక ప్రాధాన్యత ఉంది. తెలంగాణ సాయుధ పోరాట ముగింపు, నిజాం పాలన నుండి విముక్తి, ఆ వెంటనే ఉవ్వెత్తున ఎగసిన 1952 నాటి చారిత్రాత్మక ముల్కీ ఉద్యమం వంటి రాజకీయ, సామాజిక పరిణామాలు ఈ కాలంలో సంభవించాయి. ఈ ఉద్వేగభరితమైన వాతావరణంలో, సరిగ్గా ఇదే కాలంలో జన్మించిన రచయితల తరంపై ఆయా ప్రజా ఉద్యమాల ప్రభావం బలంగా పడింది. కేవలం అక్షరాలకే పరిమితం కాకుండా, ఒక ఆక్టివిస్టుగానో, సామాజిక అభిమానిగానో, వ్యవస్థాపకుడిగానో లేదా ఒక సాహిత్య నిర్మాతగానో సాహితీ, సాంస్కృతిక, సామాజిక రంగాలలో వీరు చురుగ్గా పాల్గొన్నారు. వీరు ఎదిగే క్రమంలో 1962 చైనా యుద్ధం, 1964 లో ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మరణం, 1965లో పాకిస్తాన్ యుద్ధం, 1966 లో లాల్ బహదూర్ శాస్త్రి మరణం, 1965 లో విశాఖ ఉక్కు ఉద్యమం, 1969 లో జైతెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ముందుకు వచ్చాయి. విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోయారు. ఆ తరువాత నక్సలైట్ ఉద్యమం. ఇలా 1946 నుండి 1953 మధ్య పుట్టిన ఒక ప్రత్యేక యువతరం చైతన్యంతో పలు ఉద్యమాల మధ్య ఎదుగుతూ వచ్చింది. సదానంద్ శారద ఆ చైతన్య యువతరంలో ఒకరు. 1970 నుండి చైతన్యవంతమైన సాహిత్య ప్రవాహం సాగింది.

ఈ ప్రవాహం నుండి ఎదిగిన తరం లోనే తెలుగు సాహిత్యానికి దిక్సూచిగా నిలిచిన సమకాలీన ప్రముఖ రచయితలు, బి. నరసింగరావు, గద్దర్, దేవరాజు మహారాజు, రామా చంద్ర మౌళి , బోయ జంగయ్య, అంపశయ్య నవీన్ , ఎన్ గోపి, అమ్మంగి వేణుగోపాల్, సదానంద శారద, బి.ఎస్. రాములు, అల్లం రాజయ్య, పి. చంద్ యాదగిరి, ఐతా చంద్రయ్య, భూపాల్, కాలువ మల్లయ్య, , ఉప్పల నరసింహం, సిహెచ్. మధు, కె. రామ్మోహన్ రాజు, ఆర్టిస్ట్ చంద్ర , కంచ ఐలయ్య, గూడ అంజయ్య, మొదలైనవారు. ఈ తరం నుండే పలువురు జర్నలిస్టులుగా, ఉద్యమ కారులుగా రాజకీయ నాయకులుగా ఆర్టిస్టులుగా ఎదిగి వచ్చారు.

ఈ సాహిత్య చారిత్రక నేపథ్యంలో, సాహిత్య స్రవంతిలో ప్రతి రచయితా తనదైన విలక్షణమైన ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ చారిత్రక ఉద్యమ తరం యొక్క ముఖ్య ప్రతినిధిగానే, ఆ విశిష్ట సాహిత్య ప్రవాహంలో భాగస్వామిగానే సదానంద్ శారద కూడా తనదైన శైలిలో కథలు, నవలలు రాస్తూ ప్రత్యేకమైన అస్తిత్వాన్ని చాటుకున్నారు. కథా సదస్సులు నిర్వహించారు.

ఆయన అందించిన కథలలో ముఖ్యంగా 'జాడి', 'గొలుసు', 'పాల కంకి' మరియు సదానంద్ శారద కథలు పేరిట వచ్చిన నాలుగు కథా సంపుటాలు తెలుగు కథా సాహిత్యంలో మైలురాళ్లుగా నిలిచాయి. ఆయన రాసిన ప్రసిద్ధ కథ 'జాడి' పల్లెటూరి దొరల అహంకారాన్ని, శ్రమజీవుల నిసహాయతను ఎంతో లోతుగా ఆవిష్కరించింది. సామాన్య మానవుడి కన్నీళ్లకు అక్షర రూపం ఇవ్వడమే తన సాహిత్య పరమార్థంగా భావించిన సదానంద్ శారద, ప్రతి కథలోనూ ఒక సామాజిక సందేశాన్ని బలంగా వినిపించారు. ఉదాహరణకు కొన్ని కథలు.



తెలుగు కథా సాహిత్యంలో తనదైన ముద్ర వేసి, తెలంగాణ పల్లెటూళ్ల మట్టి వాసనలను, బడుగు, బలహీన వర్గాల అంతరంగాన్ని అత్యంత సజీవంగా అక్షరీకరించిన విశిష్ట రచయిత పాకాల సదానంద శారద. సమాజంలోని రుగ్మతలను, పేదరికాన్ని, అణగారిన వర్గాల వేదనలను తన కలంతో దృశ్యమానం చేసిన ఆయన సాహిత్య ప్రస్థానం తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

### 1. 'జాడీ' కథా సంపుటి (1987)

ఈ సంపుటిలోని ప్రధాన కథ అయిన 'జాడీ'సదానంద శారద గారికి అత్యంత పేరు తెచ్చిపెట్టింది. ఇతివృత్తం: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దొరల పెత్తనం, నిరుపేద శ్రామికుల దైన్యాన్ని ఈ సంపుటిలోని కథలు ప్రతిబింబిస్తాయి. ఇందులో ప్రధాన కథలు: జాడీ (గవురయ్య అనే పేద రైతు దొరవారి జాడీని 20 మైళ్లు పట్నానికి మోసుకెళ్లే హృదయవిదారక కథ). తులసి మొక్క (ఎంత కష్టం వచ్చినా నిజాయితీగా బతకాలనుకునే ఒక ప్రభుత్వోద్యోగి పడే సంఘర్షణ). ఫోటో. ఉప్పునీళ్లు.

### 2. 'గొలుసు' కథా సంపుటి

ఈ సంపుటిలో సమాజంలోని అసమానతలు, బడుగు బలహీన వర్గాల బతుకు చిత్రాలు, మానవ సంబంధాలలోని లొసుగులను ఇతివృత్తంగా మలచిన కథలున్నాయి. ప్రధాన కథలు: గొలుసు, కీర్తివడ్డీ,



చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ లో 1993 లో కథా సదస్సులో జ్యోతి వెలిగిస్తున్న బి ఎస్ రాములు. వరుసగా చాసో, కాళీపట్నం రామారావు, దాశరథి రంగాచార్య, నసుమాస స్వామి, సదానందశారద.

కోడెను కట్టాలె, ఒక దృశ్యం కోసం, నన్ను క్షమించవూ,

### 3. 'పాలకంకి' కథా సంపుటి: పల్లె జీవనం,

వృత్తి కులాల కష్టాలు, గ్రామీణ సంస్కృతిని అద్దం పట్టే కథలు ఈ సంపుటిలో కనిపిస్తాయి. ప్రధాన కథలు:,పాలకంకి, చెట్టుకింది మనిషి,ఊళ్ళోకి బస్సొచ్చింది, చిన్న సైకిలు, ప్రయాణం.

4. 'సదానంద్ శారద కథలు' (సమగ్ర సంపుటి - 2016)

నవచేతన పబ్లిషింగ్ హౌస్ వారు ఆయన రాసిన సుమారు 150 కథల నుండి ఎంపిక చేసిన 30 ప్రతిష్టాత్మక కథలతో ఈ సమగ్ర సంపుటిని వెలువరించారు.

ఇందులో ఆయన సాహిత్య ప్రస్థానానికి అద్దం పట్టే విభిన్న నేపథ్యాల కథలు సంకలనం చేయబడ్డాయి.

మరికొన్ని ప్రసిద్ధ కథలు: ఇంటింటికీ వెలుగు ,ఎంత బాగా చెప్పావోయ్..., పావురాయి, మురికి, పిచ్చుక, అందమైన వెన్నెల, గాలి గుండె గుండెలో..., గోడవు కాకు చరిత్ర, తలుపు

## నవలా రంగంలో మైలురాళ్లు:

మంచి నీళ్ల బావి, ఆవలి తీరాలు నవలలు వెలువరించారు.

కథకుడిగానే కాకుండా నవలాకారుడిగా కూడా సదానంద్ శారద గారు అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన అంటరానితనం, కనీస తాగునీటి సదుపాయం లేక అల్లాడిపోయే అట్టడుగు వర్గాల వ్యథలను నేపథ్యంగా తీసుకుని ఆయన రాసిన అద్భుత నవల 'మంచినీళ్ల బావి'. ఈ నవల ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన నవలల పోటీలో ప్రతిష్టాత్మకమైన మొదటి బహుమతిని గెలుచుకుంది. నీటి సమస్య చుట్టూ అల్లిన కుల రాజకీయాలను, మానవతా దృక్పథాన్ని ఈ నవలలో ఆయన ఎండగట్టిన తీరు అమోఘం. దీనితో పాటు ఆయన రాసిన 'ఆవలి తీరం' నవల కూడా పాఠకాదరణ పొంది, విమర్శకుల ప్రశంలు అందుకున్నాయి.

నేనేమి రాస్తున్నానో అదే నా పరిచయం అంటారు సదానంద శారద. ఆయన సాహిత్యం ఎప్పుడూ కుల వివక్షకు , సమస్త అసమానతలకు వ్యతిరేకంగా, ఆత్మ గౌరవాన్ని పెంచి మానవతా విలువలకు అనుకూలంగా నిలిచింది. తెలుగులో ఇలాంటి కథకులు కొందరే. విహారి, సంగిశెట్టి శ్రీనివాస్, మహమ్మద్ గౌస్ తదితరులు పేర్కొన్నట్లుగా, తెలుగు కథా తేజోమూర్తులలో అగ్రగణ్యుడిగా నిలిచే సదానంద శారద గారి సాహిత్యం భావితరాలకు ఎప్పటికీ ఒక దిక్సూచిగా, దీపస్తంభంగా మార్గదర్శనం చేస్తుంది.

## సినిమా రంగంలో సాహసం -'నేనే సరోజ':

రచయితలకు, సినిమా రంగానికి మధ్య ఒక బలమైన బంధం ఉంటుంది. చాలా మంది రచయితల కథలను దర్శకులు, నిర్మాతలు సినిమాలుగా మలుస్తారు. సదానంద్ శారద గారు ఒక అడుగు ముందుకు వేసి, తన సొంత కథను తానే స్వయంగా నిర్మించే సాహసం చేశారు. శ్రీమాన్ గుమ్మడవెల్లి దర్శకత్వంలో సదానంద్ శారద కథ, మాటలు, స్క్రీన్ ప్లే సమకూర్చుతూ 'నేనే సరోజ' అనే చలనచిత్రాన్ని నిర్మించారు. ఎన్నో ఆర్థిక, సాంకేతిక ఆటుపోట్లను ఎదుర్కొని ఈ సినిమా 2023 అక్టోబర్ 6న థియేటర్లలో విడుదలైంది. కేవలం కథను అందించడమే కాకుండా, ఈ సినిమాలో ఆయన ఒక ముఖ్యమైన పాత్రను కూడా పోషించి తనలోని నటుడిని కూడా ఆవిష్కరించుకున్నారు. ఒక ప్రత్యామ్నాయ, సందేశాత్మక సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆయన తపనకు ఈ చిత్రం నిలువెత్తు నిదర్శనం.

సదానంద శారద గారి మృతి విషయం ఆలస్యంగా తెలియ వచ్చింది. తెలిసిన వెంటనే కుటుంబ సభ్యుల నుండి, అనేక ఇతర ఆధార నుండి విషయాలు సేకరించి పలు పత్రికల్లో, ఫేస్ బుక్, వాట్సాప్లలో సాహిత్య ప్రపంచానికి వెంటనే అందించే కృషి చేసారు. అతి కొద్ది కాలంలోనే మరుపుకు గురైన అనేక విషయాలను వెలికి తీసి లోకానికి అందించారు.

## ముగింపు

సదానంద శారద రాసిన కథలు ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, విపుల, యువ, ఉదయం వంటి పలు ప్రముఖ వార, మాస పత్రికలలో ప్రచురితమై విశేష పాఠకాదరణ పొందాయి. తెలంగాణ పల్లె ప్రజల దైనందిన జీవితాలు, గ్రామీణ వాతావరణం, అక్కడి సమస్యలు ఆయన కథల్లో ప్రధాన వస్తువుగా నిలిచాయి.

"సదానంద్ గారు నిరంతరం సమాజ హితాన్ని కోరే ఉత్తమ ఉపాధ్యాయుడు, రచయిత. ఆయన రాసిన కథలు సమాజంలోని అసమానతలపై సంధించిన శరాలు. హైదరాబాద్ వరంగల్ రహదారిలో ఉప్పల్ సమీపంలోని మేడిపల్లిలోని కమలానగర్ తన నివాసంలో విశ్రాంత జీవితాన్ని గడుపుతూ కూడా ఎప్పుడూ సాహిత్యం, సమాజం గురించే చర్చించేవారు. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన సృష్టించిన అక్షరాలు తెలుగు పాఠకుల హృదయాల్లో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి". 2026 అక్టోబర్ 4వ తేదీన ఆయన స్వగృహంలో దశదిన కర్మ జరగనున్న నేపథ్యంలో, సాహితీ లోకం ఆయన సేవలను స్మరించుకుంటోంది. కథకుడిగా, నవలాకారుడిగా, ఉపాధ్యాయుడిగా, చలనచిత్ర నిర్మాతగా ఆయన చేసిన బహుముఖ ప్రయోగాలు రాబోయే తరాల రచయితలకు పాఠ్యాంశాలు మార్గదర్శకాలు.




---

# ఉత్పత్తి వర్గాల తత్వమే నాగదాసు అచల తత్వం



మునిమడుగుల రాజారావుకు అవార్డు ప్రదానం చేస్తున్న డా॥ ఉదారి నారాయణ

హైదరాబాద్, అక్టోబర్ 7: ఉత్పత్తి వర్గాల తత్వమే నాగదాసు అచల తత్వమని ప్రముఖ సామాజ సేవకుడు రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సామల వీరన్న అన్నారు.

ఆదిలాబాద్ జెడ్పి సమావేశమందిరంలో జరిగిన ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కారం సభలో మునిమడుగుల రాజారావుకు అవార్డు ప్రధానం చేసిన తర్వాత ప్రసంగించారు.

ఈ సభకు ప్రముఖ కవి బాలసాని నారాయణ గౌడ్ అధ్యక్షత వహించారు.తత్వ కవులు కష్టాలకు భయపడి శ్రమకు కుటుంబానికి దూరంగా ఉండలేదని కుటుంబ ఈతి బాధలను అధిగమిస్తూ జీవిత సారాన్ని తత్వాల్లో చెప్పారని అన్నారు. ఉదారి నాగదాసు కుటుంబం కవితా పురస్కారం ఇస్తుండడం తత్వ కవులను గౌరవించడమే అని ప్రముఖ కథా రచయిత మన్నే ఏలియా అన్నారు. ఉదారి నాగదాసు అవార్డు ఆదిలాబాద్ జిల్లాకే గర్వకారణమని ఉదారి కుటుంబం చేస్తున్న సాహిత్య సేవ చాలా గొప్పదని డైట్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోల కిరణ్ కుమార్ అన్నారు. ఉదారి కుటుంబ సభ్యులు రాజారావుకు 5000/ రూపాయలు నగదు, ప్రశంసా పత్రం శాలువాతో అవార్డు అందించారు.

ఉదారి నాగదాసు కవితా పురస్కారం నాకు రావడం చాలా సంతోషం, ఉదారి కుటుంబానికి ఈ సందర్భంగా అవార్డు గ్రహిత మునిమడుగుల రాజారావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి చిందం ఆశన్న,డాక్టర్ తొడసం చందు చిందం ఆశన్న, కమలా కర్ రెడ్డి చరణ్ దాస్ హాజరయ్యారు. మమ్మల్ని వచన కవులుగా మలిచిన ఉదారి నాగదాసు స్మారక అవార్డు వేదికకు ఎప్పుడూ రుణ పడివుంటామని ఉదారి కుటుంబ సభ్యులను చిందం ఆశన్న, చరణ్ దాస్ లు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వినిపించిన ఐత్యారం ముచ్చట్లు కవుల కవితలు, పాటలు సభికులను ఆనందపరిచాయి.

# కవిత్వ పాఠశాల

ఈ వేదిక
అచల కవిత్వానికి
గాద్యజొండ్ల గుమ్మి!
నాగాపురం బండలల్ల
పురుడువోసుకున్న
పునాది పాడిరాయి!
కొత్త కవులకు జకమకరాయి!
అట్టిదద్దు,పచ్చిదద్దు
కట్టెల మోపు త్యాకుండ
ఇంటికి రాద్దు!
అన్న ప్రశ్నకు జవాబు!
"నోటజెప్పవచ్చును గాని
నడక నడవ రాదురా".....
ఊరూరు భజనల
ఉరుకులాడిన బోధ!
గొర్ల, బర్ల మేపేటోళ్ళకు
నోటికచ్చిన పాట!
నాడు యమునం!
నేడు ముదిమి!
కసలం తోవ సాకోర్ల బాట
నడిసెటోనికి నడక బురద
లోతు దెలక కొంత
"నేను రాన్రా తమ్ముడు"!
ఆ తొవ్వొంటి నడువ నా శాతగాదు
తండ్రి!
అన్న పాకాల యశోద రెడ్డి
మాటల మదుమ!
గని! ఆ ఊరికి కొత్త బాట
ఎసిన గుత్తెదారు మీ ఉదారత్వం!
సామల సదాశివ,
దామెర రాములు,
బోనగిరి రాజారెడ్డి,
అప్పాల చక్రధారి, గోవగాని,
దేశ్పాండె, కుర్మె
మొదలైన లబ్ధప్రతిష్ఠుల
నిలువెల్లగాయాల వీణ
ఈ వేదిక!
రాష్ట్ర సాధనలో
ఉద్యమం ఉగ్రూతలూగించిన వేళ!
వలసవాదానికి వ్యతిరేక గోల!
కవి సమ్మేళన కార్యం
ఎదులాపురంలో కవులు
లేరన్న అపప్రథను
తొలగించే సురవరమే ఈ వేదిక!
మీ సాహసోపేతానికి
నిదర్శనం!
గుట్టలల్ల గోండులేగాదు
రేలపాట,గుసాడీల దండారీ,
దిమ్సను ఎర్కజేసింది
ఈ వేదిక!
పొర్కదొరల పాటల సవ్వడి
అగ్రవర్ణ అహంకారం మీద
తిరుగుబాటే ఈ వేదక!
ఊరు మర్లవడిన!
మా సదువులు మాకేనని, కొలిమి నిపికెల
దగడుకు
జార లేని గుణం తొనకిసల
బడి గోడల మధ్య నలగుతున్న,
తలకండుబ్బడు, చొప్పదప్పడు
అన్న కార్యసాధకుని లక్షణాల
కలబోతే ఈ వేదిక!.
అన్న వరం దేవేందర్, అన్వర్,
ఏనుగు నరసింహారెడ్డి,
బెల్లి యాదయ్య,
తోట నిర్మలరాణి, మునిమడుగుల
రాజారావులకు
సప్పుడు గాకుండా
ఉక్కు కవచందొడిగింది
ఈ వేదికనే!
(25 ఏండ్ల ఉదారి నాగదాసు స్మారక
కవిసమ్మేళనం, కవిత
అవార్డు సభను
యాదిజేసుకొంటు..... )



-తాక్సాండె చరణ్ దాస్
9441017028.




నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..
-సంపాదకులు

## కనిపించే రైతే గొప్ప

రైతు దేశానికి వెన్నెముక
రైతు మనకోసం
రాత్రి పగలూ చాలా కష్టపడతాడు
అందరి కోసం పంట పండిస్తారు
మనం అన్నం విలువ తెలియక
అన్నాన్ని చాలా వృధా చేస్తాం
రైతు పంటలు పండించడం ఆపేస్తే
మనందరం ఆకలితో చనిపోతాం.
రైతు లేకపోతే మనం లేము
రైతు పడని కష్టం లేదు
రైతు చూడని నష్టం లేదు
రైతు చూడని చావు లేదు.
రైతులు ఆనందించే చిన్న విషయం వెనుక
ఆయన పడే కష్టం ఎంతో ఉంటుంది.
భూమిలో దొరికే
బంగారాన్ని వాడుకునేవారు రాజు అయితే
అదే భూమిలో బంగారం పండించేవాడు రైతు
గుడిలో ఉండే దేవునికి మొక్కుతావు కదా
మనకు ఆహారాన్నందించే
రైతుకు కూడా మొక్కాలి
కనిపించని దేవుని కంటే కనిపించే రైతే గొప్ప

- ఉసికె శరణ్య

## పుస్తకాల సంచి

నాతో ఉంటూ
నాతో మోపిస్తూ
నాలో సగం బరువవుతుంది పుస్తకాల సంచి.
నాకు
చదువుకునే సమయం వచ్చిందని చెబుతూ
ఎప్పుడూ నన్ను హెచ్చరిస్తుంది
ఇంటికి వెళ్లే సమయం రాగానే
నా భుజాల పై వాలుతుంది.
అది మా నాన్న తెచ్చిన సంచి
తనలో దాచుకున్న పుస్తకాలను
ఇంటికి వెళ్ళగానే చదువుకొమ్మని చేతికిచ్చి
జీవితంలో ముందుకు సాగమని చెబుతుంది.
పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠం
తనూ వింటు నన్నూ వినమని చెబుతుంది
జీవితంలో వీరుడిగా ఎదగమని చెప్తుంది.
తన కోసం కాకుండా
నాకోసం కష్టపడుతున్న దానికి నేనేమివ్వగలను
వారానికోసారి శుభ్రంగా పిండి
తెలుపుదనమివ్వడంతప్ప

- మంగలి దశ్వంత్

## ప్రకృతి

ప్రశాంతమైన ప్రకృతి
స్వచ్ఛమైన సంతోషాన్ని
మనకు అందిస్తుంది
ప్రకృతి సంతోషమే పచ్చదనం
పచ్చదనంతో పచ్చిక కూడా
ప్రాణవాయువును పంచుతుంది.
ఎల్లప్పుడూ పచ్చని చెట్లతో
ఈ నేలమ్మ పచ్చని పట్టు చీర కట్టినట్లు కానొస్తుంది
చిన్ని చిన్ని చిలకలగూడ్లు చెట్లపై కదలాడుతూ ఉంటే
చెట్ల చెవికుండలాలుగా ఉంటాయి
పక్షుల మధురమైన కిలకిల రాగాలతో
ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.
మేఘాల నుండి
చల్ల చల్లని వర్షపు చినుకులు రాలినట్టు
చెట్లపై నుండి పండువారిన ఆకులు
గాలిలో ఊయలలోగుతూ
క్రిందికి అడుగులు వేస్తుంటాయి
స్వార్థం ఎరుగని చిరునవ్వులను చిందించే
చిన్నపిల్లలు ఆనందంగా ఆడుకునే ఆట బొమ్మయి
ప్రకృతి వారికి గొడుగై నిలుస్తుంది.
తన చల్లటి నీడ ఒడిలో
జీవితపు పాఠాలను నేర్పి నిదురపుచ్చుతుంది
అమ్మలా మన ఆకలిని తీర్చి ఆదరిస్తుంది
ఇంత చేసినా ప్రకృతిని
మానవులు కష్టపెడుతున్నారని
కంటతడి పెట్టుకుంటుందే తప్ప
తిరిగి మానవులను కష్టపెట్టదు
తన గుండెలోని ఎంత భారమున్నా
ప్రేమ అనే తలుపులు తీసి
మనకు స్వాగతం పలుకుతుంది

## కాలం ఇచ్చిన కానుక

ముసలివాళ్ళ ముఖం మీద
కాలం చేసిన సంతకాలే ముడుతలు
ప్రతి ముడతలో ఒక త్యాగకథ దాగి ఉంటుంది
వణికే చేతుల్లో వేల కథల బరువు
గడియారంలోని గంటల ముల్లులా
నెమ్మదిగా నడిచే వయసు వాళ్ళది.
వాళ్ల మాటలు తక్కువైనా
ఆశీర్వాదాల బరువు ఎక్కువ
మౌనంలోనూ మనకు దారి చూపే వెలుగు వారు
మన చిన్న పలకరింపే వాళ్లకు పండుగ
మన చిరునవ్వే వాళ్ళ జీవితానికి సంపద.
వాళ్ళ కళ్ళలో సూర్యోదయాలు ఎన్నో
సూర్యాస్తమయాలు అన్ని
నడక నెమ్మదైనా మనసు మాత్రం
ఇంకా బాల్యమే జ్ఞాపకాలతో నిండిన గదులు వాళ్ళు.
నాకు మాటలు నేర్పిన నోరు
ఇప్పుడు మౌనాన్ని అలవాటు చేసుకుంది
నాకు ఎత్తుకున్న భుజాలు
ఇప్పుడు విశ్రాంతి కోరుకుంటున్నాయి.
ముసలితనం భారంకాదు
అది అనుభవాల సారం
వాళ్ళ జీవితం రాసిన పుస్తకలో
మళ్ళీ మళ్ళీ తడిమే అధ్యాయాలం మనమే!
మా నానమ్మ కాలం నాకిచ్చిన గొప్ప కానుక

- గౌండ్ల సాహితి

## కొత్త కథ ఎందుకు?

అవును మరి !!
కొత్త కథ ఎందుకు
నా కథే రాస్తాను !
ఇదంతా జరిగిన కథ కదా
కల్పితంకానే కాదు మరి
అన్నీ వాస్తవాలే -
ఎన్నెన్ని మలుపులో !!
నా కథ నేను రాస్తుంటే నాకు
నవ్వు కూడ వస్తుంది -
ఎక్కువగా ఏడ్పూ రావచ్చు !
ఎందుకంటే జరిగిన
జీవిత కథ
కదా !
నవ్వు రాకుండ ఉండదు !
ఏడ్పూ ఆపుకోలేను !
అయినా మీ అందరికీ
నా జీవితం కొత్త కథే !
ఎవరి జీవితం వారికి కథే
ఇతరులకు కొత్త కథే !

-కందాళై రాఘవాచార్య
8790593638

# కవిత్వ లక్ష్యం సామాజిక శ్రేయస్సు కావాలి: డా॥ నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణలో నిహారిణి, డా॥ నాళేశ్వరం శంకరం, రచయిత్రి గడ్డం సులోచన, డా॥ నందిని సిధారెడ్డి, కందుకూరి శ్రీరాములు, సంపత్ కుమార్, పద్మశ్రీ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 7: సామాజిక శ్రేయస్సు లక్ష్యంతో రాసి కవిత్వం పది మందిని ఆలోచింప చేస్తే అదే ఉత్తమ సాహిత్యం అని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం నిర్వహణలో గడ్డం సులోచన రచించిన **'నడిపించిన వాక్యం'** కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి డా॥ నందిని సిధారెడ్డి హాజరై సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు.

జీవితాన్ని కానీ సమాజాన్ని కానీ నడిపించే మాట, అదే వాక్యంగా శక్తి వంతంగా ప్రయోగించవచ్చని అన్నారు. సుజాత రాసిన ప్రతి కవితలో వాక్యం నిరర్థకంగా లేదని వివరించారు. కవయిత్రి గడ్డం సులోచన తన సంపుటిని లాంఛనంగా తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ డా॥నాళేశ్వరం శంకరంకు అంకితం ఇచ్చారు. డాక్టర్ శంకరం మాట్లాడుతూ తెలంగాణ రచయితల సంఘం నూతన రచయితలకు తగిన ప్రోత్సాహం ఇస్తోందని తెలిపారు. రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, కార్యదర్శి సంపత్ కుమార్, రచయిత్రి డాక్టర్ నిహారిణి, కిమ్మిడి లక్ష్మీనారాయణ రెడ్డి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



అడివి బాపిరాజు (అక్టోబరు 8, 1895 - సెప్టెంబరు 22, 1952) బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నవలాకారుడు, కవి, కథకుడు, గాయకు డు, నాటక కర్త. చిత్ర లేఖకుడు, కళాదర్శకుడు, జర్నలిస్ట్, న్యాయవాది. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి చూపేవాడు.

బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని భీమవరంలో అక్టోబర్ 8, 1895 న ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబములో కృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భీమవరం హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ లో బి.ఏ చదివి, మద్రాస్ లా కాలేజ్ లో బి.ఎల్ పట్టం పొంది, కొంతకాలం న్యాయవాద వృత్తి నిర్వహించిన తరువాత తన ఇతర వ్యాసంగాలలో కృషిని సాగించడానికి ఆ పనిని విరమించాడు. 1922 లో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అరెస్టయినాడు. తన జైలు జీవితానుభవాలను తొలకరి అనే నవలలో పొందుపరచాడు. చిత్రకళా విద్యార్థిగా ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోదకుమార ఛటోపాధ్యాయ శిష్యత్వం పొందాడు. తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగా పనిచేశాడు. తరువాత విజయవాడ ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారునిగా ఉన్నాడు. 'నవ్య సాహిత్య పరిషత్' స్థాపించినవారిలో బాపిరాజు ఒకడు. చిత్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ ప్రారంభించాడు.

భీమవరంలో న్యాయవాద వృత్తి చేస్తూ నారాయణరావు అనే సాంఘిక నవల రాశాడు. ఈ నవలకు ఆంధ్రవిశ్వకళా పరిషత్తు వారి బహుమతి లభించింది. 1934 నుంచి 1939 వరకు బందరు జాతీయ కళాశాల ప్రధానాచార్యుడిగా పనిచేశాడు. అదే సమయంలో కథలు రాశాడు. 1939 లో సినీరంగ ప్రవేశం చేసి అనసూయ, ధ్రువ విజయం, మీరాబాయి లాంటి సినిమాలకు కళాదర్శకత్వం చేశాడు. 1944 నుంచి 1947 వరకు హైదరాబాదు నుండి వెలువడే మీజాన్ పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఆ సమయంలో తుఫాను, గోన గన్నారెడ్డి, కోనంగి నవలలు రచించాడు. అడవి బాపిరాజు రచనలలో ఆధునిక తెలంగాణ ప్రాంతాలుగా పరిగణనకు గురవుతున్న ప్రాంతాలు అధికంగా ఆయన చారిత్రక నవల 'గోనగన్నారెడ్డి' లో, కథలు 'నేల', 'వడగళ్ళు' 'బండరాళ్ళు' లోనూ కనిపిస్తాయి. అడవి బాపిరాజు 'మీజాన్' పత్రిక సంపాదకుడిగా హైదరాబాదులో నివసించడం వల్ల ఆయన కథలలో హైదరాబాదు పరిసర ప్రాంతాలు అధికంగా ప్రదర్శిత మయ్యాయి. ఈ సమయంలో ఆయన తెలంగాణ ప్రాంత ప్రజల మనస్తత్వాలను, జీవన విధానా న్ని, వారి కష్టాల స్వరూపాన్ని ఆకళింపు చేసుకున్నారు.

తెలుగు దేశమంతటా విస్తృతంగా ప్రచారంలో నున్న "బావా బావా పన్నీరు" పాట ఈయన వ్రాసిందే. ఒకనాడు ఆకాశవాణి కేంద్రం ద్వారా తరుచుగా వినిపించిన

పాడకే నా రాణి, బాలవే నీవెపుడూ పాటలను ప్రసిద్ధ గాయకుడు ఎమ్మెస్ రామారావు పాడి రికార్డు చేశారు. ఇలాంటి పాటలు బహుళ ప్రాచుర్యం పొందాయి. సన్నిహితులు, సమకాలీన సాహితీ వేత్తలు ఆయన్ని ముద్దుగా "బాపి బావ" అని పిలిచేవారు. 1934లో ఆంధ్ర విశ్వకళా పరిషత్ నిర్వహించిన నవలా పోటీలో 'నారాయణ రావు' నవలకు కవి సామ్రాట్ విశ్వనాథ "వేయి పడగలు"తో పాటు ప్రథమ బహుమతి లభించడం విశేషం.

ఆయన చిత్రించిన చిత్రాలలో సముద్ర గుప్తుడు, తిక్కన ప్రసిద్ధమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి కిన్నెరసాని పాటలు బాపిరాజు చిత్రాలతో వెలువడింది. బాపిరాజు చిత్రించిన శబ్ద బ్రహ్మ అనే చిత్రం డెన్మార్కు ప్రదర్శనశాలలో ఉంది. భాగవత పురుషుడు, ఆనంద తాండవం మొదలగు చిత్రాలు తిరువాన్కూరు మ్యూజియంలో ఉన్నాయి. 1951లో అప్పటి మద్రాసు ప్రభుత్వం కోరికపై సింహళంలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతికృతులను చిత్రించారు. సెప్టెంబరు 22, 19 52న బాపిరాజు మరణించాడు.

(అక్టోబర్ 8... అడివి బాపిరాజు జయంతి)



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



శనివారం రవీంద్ర భారతి సాయితి కుటీరంలో తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించిన పాలమూరు ఆణిముత్యం శతాధిక గ్రంథకర్త డాక్టర్ కపిలవాయి లింగమూర్తి రచించిన **పాలమూరు జిల్లా చరిత్ర సంస్కృతి సాహిత్యం** అనే పుస్తకాన్ని ఆవిష్కరణ సభలో రాధా కుసుమ, ఎన్. రఘువీర్ ప్రతాప్. సభాధ్యక్షులు డాక్టర్ యన్ బాలాచారి, ముఖ్య అతిథి ఆవిష్కర్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, లింగమూర్తి కుమారుడు అశోక్ బాబు, బడేసాబ్.

# విశాఖ బీచ్‌లో విషాదం..

## ప్రాణాలు కోల్పోయిన నిజామాబాద్ యువకుడు

నిజామాబాద్, అక్టోబర్ 7: విశాఖపట్నం బీచ్‌లో జరిగిన ఓ విషాద ఘటనలో నిజామాబాద్ నగరానికి చెందిన యువకుడు తమ్మిశెట్టి వికాస్ ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం నాడు తన స్నేహితులతో కలిసి సరదాగా విశాఖపట్నం వెళ్లిన వికాస్ అక్కడ జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం అంది ంది. మృతులలో వికాస్ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డుల ఆధారంగా వివరాలు సేకరించిన విశాఖపట్నం పోలీసు లు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు.

ఈ క్రమంలో నిజామాబాద్ మూడో టౌన్ పోలీసుల విచారణలో వికాస్ నగరంలోని హమాల్‌వాడికి చెందిన యువకుడిగా నిర్ధారణ అయింది. నిజామాబాద్ నగరంలోని హమాల్‌వాడి ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి వికాస్ నివాసం ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. కుమారుడి అకస్మిక మరణవార్త విన్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వికాస్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి అతని తల్లిదండ్రులు విశాఖపట్నానికి బయలుదేరినట్లు స్థానికులు వెల్లడించారు.

# ఘనంగా "ఓ తల్లి తీర్పు" కథా సంపుటి ఆవిష్కరణ



హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రగతి కల్చరల్ అసోసియేషన్, అక్షర కుసుమాలు ఆధ్వర్యంలో శ్రీమతి తాడి మేటి శ్రీ దేవి రచించిన ఓ తల్లి తీర్పు కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రముఖ సినీ గీత రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది, ఉగాది పురస్కారాల గ్రహీత శ్రీ సాదనాల వేంకట స్వామి నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ లో ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సంపుటిని తాడిమేటి ఆరోమేటిక్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ తాడిమేటి మధు చక్రపాణి రావు ఆవిష్కరించారు. ఈ కథా సంపుటి నుండి కవయిత్రి శ్రీమతి వనజా బలుసాని, డాక్టర్ టి. శ్రీ లక్ష్మి సమీక్షించారు. ప్రముఖ కథా రచయిత శ్రీ పాలకోడేటి సత్యనారాయణ, సాహితీ వేత్తలు శ్రీ చాగంటి ప్రసాద్, పెమ్మరాజు విజయ రామచంద్ర, సిహెచ్. మల్లయాచారి, చాగంటి రమాదేవి, సత్యవీణ మొండ్రేటి తదితరులు పాల్గొన్నారు. ముందుగా కవి సమ్మేళనం జరిగింది.



అక్టోబర్1న రవీంద్రభారతి కాన్ఫరెన్సస హాలులో డా॥ బోయ జంగయ్య 84వ జయంతి వేడుకలో **'పునాస'** సాహిత్య త్రైమాసిక పత్రిక ఆవిష్కరణ సభలో డా॥ పసునూరి రవీందర్, డా॥ నామోజు బాలాచారి, ఆచార్య గడ్డం మల్లేశం, శ్రీమతి వాణి ప్రసాద్ (ఐఎఎస్), బి.యస్.రాములు, కాశీం, కోయి కోటేశ్వరరావు తదితరులు.

# వైభవంగా డాక్టర్ కాసర్ల రంగారావు గారి పుస్తక పరిచయ సభ




సభలో ప్రసంగిస్తున్న సాధనాల వెంకటస్వామి నాయుడు.

ఖమ్మం, అక్టోబర్ 7: ఖమ్మం వికాస వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విశ్రాంత విద్యుత్ శాఖ అధికారి డాక్టర్ కాసర్ల రంగారావు గారి పుస్తక పరిచయ సభ వైభవంగా జరిగింది. ఆదివారం ఖమ్మం జిల్లా పరిషత్ హాలు లో జరిగిన ఈ సభలో ప్రముఖ సినీ గీత రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది బహుమతి గ్రహీత తెలుగు విశ్వవిద్యాలయ బంగారు పతక విజేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత సాధనాల వేంకట స్వామి నాయుడు కాసర్ల వారి భాషాంజలి, నానోలు పుస్తకాలను లోతుగా సమీక్షించారు. తెలుగు వెలుగులు పుస్తకాన్ని ప్రముఖ బాల రచయిత. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, అక్షర శిల్పాలు పుస్తకాన్ని ప్రముఖ కవి ఎన్.తిర్మల్, ఊర్వశి తో సంభాషణలు పుస్తకాన్ని హైకోర్టు అడ్వకేట్ అవధానం రఘుకుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్ తిర్మల్ రాసిన త్రిభాషా కవి హీరాలాల్ మోరియా పై సమగ్రంగా రాసిన గ్రంథాన్ని వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాదనాల వేంకట స్వామి నాయుడు ఆవిష్కరించారు. ఈ సభలో ప్రముఖ కవి, వికాస వేదిక కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, అధ్యక్షుడు బుక్కా సత్యనారాయణ, కవయిత్రి యడవల్లి శైలజ, తిరునగరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కళాకారుల సంఘు అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన పాగి వెంకన్న, బొమ్మెర ముత్యం గార్లను ఘనంగా కళాకారులు సత్కరించారు. అనంతరం కవి సమ్మేళనం కమనీయంగా జరిగింది. మలిశెట్టి కృష్ణ మూర్తి అధ్యక్షతన ముప్పై మంది కవులు తమ కవితా గానం చేశారు.

# చుండూరు రవికుమార్ కవితా సంపుటాల ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, అక్టోబర్ 7: డల్లాస్ (యుఎస్.ఏ) నివాసి, ప్రవాస రచయిత చుండూరు రవికుమార్ రచించిన మూడు కవితా సంపుటాల ఆవిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలుగు సాహితీవనం సమూహం ఆధ్వర్యంలో జరిగింది. సాహిత్య ప్రియుల నడుమ ఉదయం. మధ్యాహ్నం రెండు విడతలుగా సాగిన ఈ కార్యక్ర మంలో ప్రముఖ సాహితీవేత్తలు, కవులు విశిష్ట అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం తెలుగు సాహితీవనం వ్యవస్థాపకులు శాంతికృష్ణ అధ్యక్షతన జరిగి మొదటి విడత సభలో ప్రముఖ సాహితీవేత్త, ఎస్వీయూ పూర్వ ఉపకులపతి కొలక లూరి ఇనాక్ ముఖ్య అతిథిగా హాజరై **'విజయభేరి'** కవితా సంపుటిని ఆవిష్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొని **'మహా ప్రస్థానం'** కవితా సంపుటిని ఆవిష్కరించారు.

అనంతరం ప్రముఖ రచయిత్రి శిలా సుభద్రా దేవి, గజల్ కవయిత్రి డాక్టర్ గడ్డం శ్యామల, రచయిత డాక్టర్ బెల్లంకొండ సంపత్‌కుమార్ పుస్తకాలపై సమగ్ర సమీక్షలు అందించగా, ప్రభుత్వ అధికారి సుమన ప్రణవ్ సభా సమన్వయం వహించారు.

మధ్యాహ్నం సీనియర్ జర్నలిస్ట్ సత్యాజీ అధ్యక్షతన జరిగిన రెండో విడత సభలో జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ముఖ్య అతిథిగా హాజరై **'మా ఊరు-నా వాళ్ళు'** కవితా సంపుటిని ఆవిష్కరించారు. సీనియర్ గేయ రచయిత రచయిత మౌనశ్రీ మల్లిక్ విశిష్ట అతిథిగా ప్రసంగించగా, సి.ఎస్.రావు, విశ్రాంత చీఫ్ మేనేజర్ లలిత అన్నపూర్ణ ఆత్మీయ అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. రచయిత చుడూరు రవికుమార్ మాట్లాడుతూ.. మాతృభూమిపై ఉన్న ప్రేమతోనే ఈ రచనలు చేశానని, సాహితీ దిగ్గజాల చేతుల మీదుగా తన గ్రంథాలు ఆవిష్కరణ కావడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు.

# విషాదం.. విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

షాద్ నగర్ అక్టోబర్ 7 తెల్లవారుజామున పొలం బాట పట్టిన రైతును తెగిపడిన విద్యుత్ వైర్లు బలిగొన్న విషాద ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలో చోటుచేసుకుంది. దేవునిబండ తండాకు చెందిన మూడవత్ బాలు (42) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటనతో తండాలో విషా దఛాయలు అలుముకున్నాయి. బుధవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో బాలు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. వరి చేనులోకి నడుచుకుంటూ వెళ్తుండగా పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు అతని కాళ్లకు తగిలినట్లు సమాచారం. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైన బాలు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఉదయం వేళ పొలానికి వెళ్లిన రైతు విగతజీవిగా కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గుర య్యారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకు న్నారు. అప్పటికే బాలు మృతి చెందినట్లు గుర్తించారు. పంటను కాపాడుకునేందుకు తెల్లవారుజామునే పొలానికి వెళ్లిన రైతు తిరిగి ఇంటికి చేరకుండానే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న కుటుంబానికి ఈ ఘటన తీరని లోటుగా మారింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.